
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

సోమవారం 12 ఫిబ్రవరి 2024

మూడు ముళ్లకు 3 నెలలదాకా ముహుర్తాలు

2వేలవరకు వివాహాలకు, గృహప్రవేశాలకు అవకాశం

కళ్యాణ మండపాలకు, ఫంక్షన్ హాళ్లకు పెరిగిన గిరాకీ



పెళ్లిసందడి

తిరుపతి సిటీ, ఫిబ్రవరి 11: మాఘమాసం శనివారం మధ్యాహ్నం నుంచీ మొదలైపోవడంతో జిల్లావ్యాప్తంగా వివాహాల ఏర్పాట్లు జోరందుకున్నాయి.పెళ్లిళ్లకు ఈ నెల 13న ముహూర్తం మొదలై ఏప్రిల్ 26 వరకు దాదాపు 30 ముహూర్తాలు ఉన్నట్లు పంచాంగవేత్తలు చెబుతున్నారు. ఏప్రిల్ 28 నుంచి మూఢం మొదలవుతుంది. వైశాఖ, జ్యేష్ఠ మాసాల్లో ముహూర్తాలు లేవు. ఆ తరువాత ఆషాఢ మాసం పెళ్లిళ్లకు పనికిరాదు. మళ్లీ ఆగస్టులో శ్రావణ మాసం వచ్చేవరకూ పెళ్లి ముహూర్తాలు లేకపోవడంతో ఓ పక్క వివాహాలు,మరో పక్క గృహప్రవేశాల సందడి ఊపందుకుంది.ఈ మూడు నెలల్లో జిల్లావ్యాప్తంగా రెండు వేలకు పైగా వివాహాలు జరగనున్నాయి. వీటితోపాటు గృహప్రవేశాలు, భూమిపూజలు, బారసాలలు వంటి కార్యక్రమాలు మరో వెయ్యికి పైగా జరగనున్నాయి. దాదాపు నాలుగు నెలల విరామం తరువాత మంచి ముహూర్తాలు రావడంతో జిల్లాలో ఎక్కడ చూసినా కళ్యాణ మండపాల్లో నో బుకింగ్ బోర్డులు దర్శనమిస్తున్నాయి. జిల్లాలో గుర్తింపు ఉన్న సుమారు 1200 కళ్యాణ మండపాలతో పాటు దేవాలయాల పరిధిలోని మరో 300కళ్యాణ మండపాలు పూర్తిగా బుక్ అయిపోయాయి.డిమాండుకు అనుగుణంగా రూ. లక్ష ఉన్న కళ్యాణ మండపాల అద్దె రూ. మూడు లక్షలకు పైగా పలుకుతోంది.చిన్నాచితకా ఫంక్షన్ హాళ్లను కూడా బుక్ చేసుకోవడంతో ఆలస్యంగా ముహూర్తాలు పెట్టుకున్న వారికి కళ్యాణ మండపాలు దొరక్క అనువుగా ఉండే ఆలయాలతో పాటు ఇళ్ల వద్ద ఎక్కడ అనుకూలంగా ఉంటే అక్కడ పెళ్లిళ్లు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పురోహితులకు, ఫొటోగ్రాఫర్లకు, వీడియోగ్రాఫర్లకు, బ్యూటీషియన్లకు, వంటల నిర్వాహకులకు, బ్యాండు మేళాలు, ఆర్కెస్ట్రాలతోపాటు ట్రావెల్స్ వాహనాలకు కూడా డిమాండు బాగా పెరిగిపోయింది.

మంచి ముహుర్తాల తేదీలు

- ఫిబ్రవరిలో 13, 14, 17, 18, 24, 28, 29 తేదీలు
- మార్చిలో 2, 3, 15, 17, 20, 22, 24, 25, 27, 28, 30
- ఏప్రిల్‌లో 3, 4, 9, 18, 19, 20, 21, 22, 24, 26

వివాహాల రిజిస్ట్రేషన్ ఛార్జీల భారీ పెంపు

ప్రభుత్వం ఇదే అదునుగా భావించి వివాహాల రిజిస్ట్రేషన్ ఛార్జీలను భారీగా పెంచుతూ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం వివాహ రిజిస్ట్రేషన్ ఛార్జి రూ. 200కాగా దీన్ని రూ. 500కు పెంచారు. వివాహ వేదిక వద్దకు రిజిస్ట్రార్ వస్తే ఇప్పటివరకు రూ.210 ఫీజు వసూలు చేసేవారు. దీన్ని రూ. 5వేలకు పెంచేశారు. వివాహాల దస్త్రాల పరిశీలనకు రూపాయి వున్న ఫీజును రూ. 100కు పెంచారు. సెలవు రోజుల్లో వివాహాలను నమోదు చేస్తే రూ. 5 వేల ఫీజును నిర్ణయించారు.

తిరుపతి ఉప పోరుకు

- ఈసీ ఆదేశాలతో ఇద్దరు సీఐలు సహా ఎస్ఐ, హెడ్‌కానిస్టేబుల్ సస్పెన్షన్
- వీఆర్‌కు ఇద్దరు సీఐలు

మరో నలుగురు బలి!

- ఎన్నికల్లో అక్రమాలపై విచారణలో నిర్లక్ష్య పర్యవసానం
- అనుమతి లేకుండా హెడ్‌క్వార్టర్స్ దాటిపోకూడదని ఆదేశం



సీఐలు శివప్రసాదరెడ్డి, శివప్రసాద్

సీఐలు అబ్బన్న, దేవేంద్రకుమార్

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11: తిరుపతి పార్లమెంటు ఉప ఎన్నికల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి తాజాగా ముగ్గురు పోలీసు అధికారులు, ఓ హెడ్‌కానిస్టేబుల్ సస్పెండ్‌కాగా మరో ఇద్దరు పోలీసు అధికారులు వీఆర్‌కు బదిలీ అయ్యారు.అన్నమయ్య జిల్లా కలెక్టర్ గిరీషా సస్పెన్షన్‌తో మొదలైన కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు తాజాగా మరో నలుగురి సస్పెన్షన్‌కు కారణమయ్యాయి.2021వ సంవత్సరంలో జరిగిన తిరుపతి లోక్‌సభ ఉప ఎన్నికల్లో అధికార పార్టీ నేతలు ఇతర ప్రాంతాల ఓటర్లను బస్సుల్లో తరలించి మరీ పోలింగ్ చేయించారు. వారికోసం ఏకంగా 34 వేల ఓటరు ఐడీ కార్డులను అక్రమంగా డౌన్‌లోడ్ చేయించారు.ఈ వ్యవహారాన్నంతటినీ చూసీచూడనట్టు వ్యవహరించిన పోలీసులు ప్రతిపక్షాలు ఆధారాలతో సహా ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదు. పైగా కాలక్రమంలో ఆయా కేసులను కొట్టివేశారు. ఈ వ్యవహారంపై స్పందించిన కేంద్ర ఎన్నికల కమిషన్ దర్యాప్తునకు ఆదేశించింది. పోలీసుల బాధ్యతా నిర్వహణపై దర్యాప్తుచేసి న ఉన్నతాధికారులు పలువురు పోలీసు అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతోపాటు ఫిర్యాదులపై సక్రమంగా దర్యాప్తు చేయలేదని, ఆరోపణలు వచ్చినవారిని విచారించలేదని నిర్ధారించారు. అలాగే దొంగ ఓట్లపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ఆయా దొంగ ఓటర్లకు చెందిన ఎపిక్ కార్డులు, ఆధార్ కార్డులు ఇతర వివరాలను కూడా సేకరించి భద్రపరచాల్సి ఉండగా అవేమీ చేయలేదని కనుగొన్నారు. ఎటువంటి విచారణ లేకుండానే ఆయా కేసులను మూసివేసినట్టు గుర్తించారు. దీంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అందుకు బాధ్యులైన పోలీసు అధికారులు, సిబ్బందిపై అనంతపురం రేంజి డీఐజీ చర్యలు తీసుకుంటూ ఆదేశాలు జారీ చేశారు.అప్పట్లో ఈస్ట్ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేసి ప్రస్తుతం తిరుపతి ఎస్‌టీ సీఐగా పనిచేస్తున్న బీవీ శివప్రసాదరెడ్డి, ఎస్ఐగా పనిచేసి ప్రస్తుతం వీఆర్‌లో ఉన్న ఎ.జయస్వాములు, అప్పట్లో స్టేషన్ రైటర్‌గా పనిచేసిన హెడ్‌కానిస్టేబుల్ కె. ద్వారకనాథరెడ్డి, వెస్ట్ సీఐగా పనిచేసి ప్రస్తుతం సత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న శివప్రసాద్‌ను సస్పెండ్ చేశారు. క్రైమ్ నంబర్ 176/2021 అండర్ సెక్షన్ 171 (ఎఫ్), 188 ఐపీసీ ప్రకారం అప్పట్లో ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసుకు సంబంధించి హెడ్ కానిస్టేబుల్ కె. ద్వారకనాథరెడ్డి తప్పుడు సెక్షన్లతో కేసు నమోదు చేశారని, కేసు ఇన్వెస్టిగేషన్ అధికారిగా ద్వారకనాథరెడ్డి ఫిర్యాదుదారుని, సంబంధిత పోలింగ్ అధికారులను, బీఎల్‌ఓలను, నేరం జరిగిన ప్రదేశంలో ఉన్న పోలీసు సిబ్బందిని, పోలింగ్ బూత్‌లో ఉన్న ఇతర ఓటర్లను విచారించడంలో విఫలమయ్యాడని, అలాగే నిందితుల ఓటరు ఐడీ, ఎపిక్‌కార్డులు, ఆధార్ కార్డులను స్వాధీనం చేసుకోవడంలో నిర్లక్ష్యం వహించారని అందుకుగాను అయన్ను సస్పెండ్ చేస్తున్నట్టు డీఐజీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే ఎస్ఐ జయస్వాములు నేరం జరిగిన ప్రదేశాన్ని సందర్శించి సాక్షులను విచారించడంలో విఫలమయ్యారని, ఐపీసీ సెక్షన్ 171(ఎఫ్) ప్రకారం నేరాన్ని నిరూపించడానికి సాక్ష్యాలను సేకరించాల్సిందిపోయి ఉన్నతాధికారుల ముందస్తు అనుమతి లేకుండా కేసుకు సంబంధించిన సెక్షన్ను ఐపీసీ 290కి మార్చుచేసేందుకుగాను న్యాయస్థానంలో మెమో దాఖలు చేశారని ఉత్తర్వుల్లో వివరించారు. నకిలీ ఎపిక్ కార్డులకు సంబంధించిన అత్యంత ముఖ్యమైన కేసులో సెక్షన్ మార్చి ఐపీసీ 290 ప్రకారం చార్జిషీట్ దాఖలు చేయడం దర్యాప్తు తీరు, నిబద్ధతను శంకించే విధంగా ఉందని పేర్కొన్నారు. ఇక సీఐ బీవీ శివప్రసాదరెడ్డి హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ)గా స్టేషన్‌కు అధిపతి అయినందున కేసు దర్యాప్తును పర్యవేక్షిస్తూ, కింది అధికారులకు మార్గనిర్దేశం చేయాలి. ఎస్‌హెచ్‌ఓ పూర్తిస్థాయిలో పరిశీలించిన తరువాత మాత్రమే కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా కేసు వాస్తవాలను పరిశీలించి, సేకరించిన సాక్ష్యాల ఆధారంగా దర్యాప్తును ధృవీకరించి, చట్టంలో తగిన సెక్షన్‌కింద ఛార్జిషీట్ దాఖలు చేయాల్సి ఉంటుంది. ముఖ్యమైన వ్యవహారంలో అవసరమైన స్థాయిపర్యవేక్షణను అమలు చేయడంలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ బీవీ శివప్రసాద రెడ్డి విఫలమయ్యారని డీఐజీ ఉత్తర్వులో పేర్కొన్నారు. అలాగే దొంగ ఓట్లపై నమోదైన ఓ కేసుకు సంబంధించి దర్యాప్తు సక్రమంగా నిర్వహించలేదనే కారణంతో అప్పట్లో తిరుపతి వెస్ట్ పోలీస్ స్టేషన్ సీఐగా పనిచేసి ప్రస్తుతం సత్యసాయి జిల్లా వీఆర్‌లో ఉన్న సీఐ శివప్రసాద్‌ను కూడా సస్పెండ్ చేశారు. వీరిని విధుల నుంచి తాత్కాలికంగా తొలగిస్తున్నట్టు, అనుమతి లేకుండా వారు హెడ్‌క్వార్టర్స్ దాటి పోకూడదని డీఐజీ ఆదేశించారు.ఉప ఎన్నిక సమయంలో అలిపిరి పోలీస్ స్టేషన్‌లో నమోదైన మరో కేసుకు సంబంధించి దర్యాప్తు చేయకుండానే కేసును మూసివేశారనే కారణంతో ఇద్దరు సీఐలను డీఐజీ వీఆర్‌కు ఆదేశించారు. అప్పట్లో అలిపిరి సీఐగా పనిచేసి ప్రస్తుతం రేణిగుంట రైల్వే సీఐగా పనిచేస్తున్న దేవేంద్రకుమార్‌ను, ప్రస్తుతం సీఐగా ఉన్న అబ్బన్నను అనంతపురం వీఆర్‌కు బదిలీ చేశారు.



ఎస్ఐ జయస్వాములు

కోడిపందేలు ఆపమన్నందుకు

పోలీసులపై దాడి

ఎస్ఐ సహా ముగ్గురికి గాయాలు

వాకాడు, ఫిబ్రవరి 11: కోడి పందేలను ఆపమన్నందుకు పోలీసులపైనే దాడి చేసిన సంఘటన వాకాడు మండలంలో చోటు చేసుకుంది. దుగరాజపట్నం పంచాయతీ కొండూరుపాళెం మద్యంషాపు పక్కన ప్రతి ఆదివారం కోడిపందేలు నడుస్తుంటాయి.సెబ్ ఎస్ఐ జయరావు ఇద్దరు సిబ్బందితో కలిసి మఫ్టీలో ఆదివారం సాయంత్రం ఆరున్నర గంటలకు కోడిపందేలు జరుగుతున్న ప్రదేశానికి వెళ్లారు. కోడిపందేలు ఆపివేయాలని చెప్పడంతో ఆగ్రహించిన కొండూరుపాళెం,అంజలాపురం ప్రాంతాలకు చెందిన పందెంరాయుళ్లు ఒక్కసారిగా దాడికి దిగారు.సెబ్ ఎస్ఐ జయరావుకు ముఖంపై గాయం కావడంతో కోటలోని ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. ఎస్ఐ పవన్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సత్యవేడులో సర్వేతో అలజడి

సత్యవేడు, ఫిబ్రవరి 11: అభ్యర్థి ఎంపిక విషయంపై టీడీపీ అధిష్ఠానం నియోజకవర్గాల్లో ఐవీఆర్‌ఎస్ సర్వే చేయిస్తున్న విషయం తెలిసిందే. ఆదివారం ఉదయం సత్యవేడు నియోజకవర్గంలో టీడీపీ నాయకుల, కార్యకర్తలకు ఫోన్ కాల్స్ వచ్చాయి. అభ్యర్థి ఎవరైతే బాగుంటుంది అంటూ అని అభిప్రాయ సేకరణ జరిపారు. సత్యవేడు టీడీపీ ఆశావహ అభ్యర్థి చందన స్రవంతి, నోటా పేర్లతో అభిప్రాయాన్ని ఫోన్ కాల్స్ ద్వారా అడిగారు. చందన కావాలంటే 1 నొక్కండి, వద్దంటే(నోటా) 2 నొక్కండి అని వచ్చిన ఫోన్ కాల్స్ చర్చనీయాంశంగా మారాయి. సాధారణంగా అభ్యర్థుల ఎంపిక కోసం నిర్వహిస్తున్న సర్వేల్లో కనీసం ఇద్దరు, ముగ్గురు అభ్యర్థుల పేర్లుంటాయి. సత్యవేడు నాయకులకు వచ్చిన ఫోన్ కాల్‌లో ఒకే ఒక పేరును సూచిస్తూ అభిప్రాయాల సేకరణ జరపడంతో ఇది పార్టీ నిర్వహిస్తున్న సర్వే కాదని మెజారిటీ నాయకులు అభిప్రాయపడ్డారు.

సమావేశంలో ప్రసంగిస్తున్న రాజేష్



వైసీపీకి కుదిరిన ముహూర్తం

ఎట్టకేలకు నియోజకవర్గంలో అడుగు పెట్టిన సత్యవేడు అభ్యర్థి

సత్యవేడు,ఫిబ్రవరి 11: సత్యవేడు వైసీపీలో అధినాయకత్వానికి, నియోజకవర్గ నాయకులకు మధ్య పెరిగిన గ్యాప్ కవర్ చేసుకునేందుకు ముహూర్తం కుదిరినట్లు కనబడుతోంది. పార్టీ ప్రకటించిన అభ్యర్థి నూకతోటి రాజేష్ ఎట్టకేలకు నియోజకవర్గంలో ఆదివారం అడుగుపెట్టారు. వైసీపీ అధిష్ఠానం ఇటీవల నియోజకవర్గంలో చేసిన అభ్యర్థుల మార్పు ప్రయోగం విఫలమై శ్రేణుల్లో అసంతృప్తి పెల్లుబికింది. తమను సంప్రదించకుండా, మాటమాత్రమైనా చెప్పకుండా అభ్యర్థులను మార్చిన అధిష్ఠానం నిర్ణయంపై స్థానిక నాయకులు అలకబూనారు. ఉమ్మడి జిల్లాలోని చిత్తూరు, పూతలపట్టు నియోజకవర్గాలకు నూతన ఇన్‌చార్జులుగా నియమితులైన విజయానందరెడ్డి, సునీల్ కుమార్ పార్టీ, ప్రభుత్వ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుండగా సత్యవేడు ఇన్‌చార్జ్ రాజేష్ మాత్రం పది రోజులైనా నియోజకవర్గానికి రాకపోవడం, మర్యాదపూర్వకంగానైనా కలవకపోవడం నాయకుల్లో అసంతృప్తి రాజేసింది. ఈ నేపథ్యంలో పార్టీకి, నాయకులకు మధ్య చాలా గ్యాప్ ఏర్పడింది. కొత్త అభ్యర్థి ప్రకటనతో నియోజకవర్గంలో ఏర్పడిన గందరగోళం, క్యాడర్‌లో వచ్చిన వ్యతిరేకత తదితర అంశాలను స్థానిక నాయకులు జిల్లా కీలక నేతకు వివరించి, మళ్లీ గురుమూర్తి లేదా నారాయణస్వామిలలో ఎవరినైనా ఒకరిని ఇక్కడ అభ్యర్థిగా ప్రకటించాలని కోరినట్లు సమాచారం. అయితే రాజేష్ అభ్యర్థిత్వంలో ఇక మార్పు ఉండబోదని ఆయన తేల్చి చెప్పినట్లు వినికిడి.ఈ నేపథ్యంలో వైసీపీ అధిష్ఠానం ఓ మంచిమూహూర్తం చూసుకుని నియోజకవర్గ స్థాయిలో ఆత్మీయ భేటీ నిర్వహించి రాజేష్‌ను నియోజకవర్గానికి పరిచయం చేయాలనుకుంది. ఈలోగా నియోజకవర్గంలో గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో ఖంగుతిన్న పార్టీ పెద్దలు రాజేష్‌ను హుటాహుటిన నియోజకవర్గ పర్యటనకు పంపించారు. దీంతో బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో కొద్దిమంది నాయకులతో ఆదివారం ఆయన సమావేశమయ్యారు. తన గెలుపు కోసం అందరూ కష్టపడి పనిచేసి వైసీపీ చేపట్టిన కార్యక్రమాలను ప్రజల దగ్గరకు తీసుకుపోవాలన్నారు.ఈ సమావేశానికి వైసీపీలోని ఓ వర్గం దుమ్మాకొట్టడం చర్చనీయాంశంగా మారింది.



సభలో ప్రసంగిస్తున్న షర్మిల

నగరికి నలుగురు మంత్రులట!

- జబర్దస్తీగా దోచేస్తున్నారట
- రోజాపై వైఎస్ షర్మిల ఆరోపణల వర్షం

నగరి, ఫిబ్రవరి 11: 'నగరి నియోజకవర్గంలో రోజా ఒక మంత్రి, ఆమె భర్త మరో మంత్రి, అన్నదమ్ములిద్దరు కూడా మంత్రులు. నలుగురు మంత్రులూ జబర్దస్తీగా దోచేస్తున్నారు' అంటూ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి విమర్శించారు. నగరి పట్టణంలోని టవర్ క్లాక్ వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన సభలో ఆమె సీఎం జగన్ పాలనా వైఫల్యాలతోపాటు మంత్రి రోజాపై విమర్శల వర్షం కురిపించారు. నగరి నియోజకవర్గంలో రాత్రికి రాత్రే కొండలు మాయమవుతున్నాయన్నారు. గ్రావెల్, మట్టి, ఇసుక ఇష్టారాజ్యంగా తరలిస్తూ రూ.వందల కోట్లు జబర్దస్తీగా దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. ఆఖరికి చిన్నచిన్న ఉద్యోగాల్లో సిఫార్సులకు కూడా కమీషన్లు దండుకుంటున్నారని విమర్శించారు.నిరుపేదలకు కట్టించే పక్కా గృహాల్లో సైతం రూ.వందల కోట్లు దోచుకుంటున్నారన్నారు. ఎవరైనా వెంచర్లు వేస్తే వారికి ప్లాట్లన్నా ఇవ్వాలట, కప్పం అన్నా చెల్లించాలట. వారి కన్ను పడితే ఇక అంతే ఆ ప్లాట్ల గతి అని జనమంటున్నారన్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు, తహసీల్దార్ కార్యాలయాల నుంచి నెలవారీ ముడుపులు తీసుకుంటున్నారంటూ ఆరోపించారు. వైఎస్ రాజశేఖర రెడ్డి హయాంలో చేపట్టిన గాలేరు-నగరి ప్రాజెక్టు నేటికీ పూర్తికాలేదంటే జగన్‌రెడ్డికి రైతుల పట్ల ఎంత శ్రద్ధ ఉందో తెలుస్తోందన్నారు. చెరకు పరిశ్రమలను తెరిపించి రైతులను ఆదుకుంటామని నాడు హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చాక పట్టించుకోలేదని విమర్శించారు. మరమగ్గ కార్మికులకు ఒకనాడు 1000 రూపాయలు వచ్చే విద్యుత్ చార్జీలు ఇప్పుడు రూ.5000కు పెరిగిపోవడంతో బతకాలా? ఆత్మహత్యలు చేసుకోవాలా? అన్న స్థితిలో వున్నారన్నారు. నగరిలో కాలుష్య నివారణకు రంగుసీటి శుద్ధి కోసం పెట్టిన ఈటీపీ ప్లాంట్ నడపడానికి అవసరమైన ఖర్చును కూడా భరించలేని స్థితిలో జగన్ ప్రభుత్వం వుందన్నారు. విజయా డెయిరీని తెరిపిస్తామని నాడు చెప్పి.. నేడు అమూల్ డెయిరీకి అప్పనంగా అంటగట్టారన్నారు. కాగా నగరిలో షర్మిల పర్యటనకు మంచి స్పందన వచ్చింది. సాయంత్రం 5.30 గంటలకు నగరి పట్టణ పరిధిలోని ఓంశక్తి ఆలయం నుంచి టవర్‌క్లాక్ వరకు కాంగ్రెస్ శ్రేణులతో కలసి షర్మిల ర్యాలీ నిర్వహించారు. అనంతరం వైఎస్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించాక గంటన్నరకుపైగా ప్రసంగించారు. సీఎం జగన్‌తో పాటు మంత్రి రోజాపై షర్మిల విమర్శలకు కరతాళ ధ్వనులతో సభ మారుమోగింది.



నగరి ర్యాలీలో షర్మిల అభివాదం


ఓటేసి పుణ్యం కట్టుకోండి

- ఓటర్ల జాబితాలో మృతుల పేర్లపై వినూత్న నిరసన
- శ్మశానంలో సమాధుల వద్ద ఓటు వేయాలని అభ్యర్థన



చంద్రగిరి, ఫిబ్రవరి 11: చంద్రగిరి నియోజకవర్గానికి సంబంధించి ఇటీవల విడుదల చేసిన తుది ఓటరు జాబితాలో చనిపోయిన వారి పేర్లు తొలగించకపోవడంపై పుదిపట్ల సర్పంచ్, ఓబీసీ సంఘ నేత బడి సుధాయాదవ్ వినూత్న నిరసన చేపట్టారు.ఆదివారం చంద్రగిరిలోని శ్యామలాంబ సమేత మల్లేశ్వరాలయం నుంచి ఓటరు జాబితలో చనిపోయిన వారి ఓట్లు, బోగస్ ఓట్లు తొలగించాలంటూ నినాదాలతో స్వర్ణముఖినది పరివాహక ప్రాంతంలోని శ్మశాన వాటిక వద్దకు ర్యాలీగా వచ్చారు. చంద్రగిరికి చెందిన సుశీలమ్మ, నారాయణ సమాధుల వద్దకు వచ్చి గోడ గడియారం, కుక్కరు గిఫ్టులు పెట్టి తను చంద్రగిరి ఎమ్మెల్యేగా పోటీ చేస్తున్నానని, కావున తనకు ఓటు వేయాలని వేడుకుంటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర రెడ్డి తండ్రి, సోదరుడు మరణించినా వారి ఓట్లు తొలగించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు.






ఆకట్టుకున్న చిత్రకళా ప్రదర్శన

● ముగింపు సభలో కళాకారులకు సత్కారం





తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 11: తిరుపతి ఆర్ట్ సొసైటీ (టీఏఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నేషనల్ ఆర్ట్ క్యాంప్, ప్రదర్శన ఆదివారం సాయంత్రం ముగిసింది. శ్రీవేంకటేశ్వర సంగీత నృత్య కళాశాల ఆవరణలో నిర్వహించిన ముగింపు సభలో ఎస్వీయూ మాజీ వీసీ ఆచార్య పి.మురళి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చిత్రలేఖనం వంటి సృజనాత్మక కళలను ప్రోత్సహించడం ముదావహమన్నారు. అనంతరం సీనియర్ చిత్రకారులు రావూరి సుబాష్ బాబు, చింతా నారప్ప, సి.వి.అంబాజీలను సత్కరించారు. లైవ్ చిత్రకళా ప్రదర్శనలో పాల్గొన్న కళాకారులను



అభినందించారు. జ్ఞాపికలతో సత్కరించారు. రెండు రోజుల ఈ చిత్రకళా ప్రదర్శనలో తమిళనాడు, పశ్చిమబెంగాల్, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన చిత్రకారులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఆర్ట్ సొసైటీ (టీఏఎస్)అధ్యక్షుడు డాక్టర్ హేమాక్షిఆచారి, కార్యదర్శి ఈసలాపురం బాలసుబ్రమణ్యం, ఎస్వీ సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ ఉమ ముద్దుబాల, ప్రముఖ చిత్రకారులు సింగంపల్లి సత్యనారాయణ, కలువగుంట రామమూర్తి, బి.అర్చన, జి.ఎస్.ప్రసాద్, రామచంద్రయ్య, ఆనంద్, హేమంత్ బాబు, గాయత్రీదేవి, రమాదేవి, కొసనా భాస్కరరావు పాల్గొన్నారు.

మల్లాలమ్మను దర్శించుకున్న పులివర్తి నాని



చంద్రగిరి, ఫిబ్రవరి 11: చంద్రగిరి మండలం మిట్టపాలెం వద్ద మేదర సంఘం ఆధ్వర్యంలో ఆదివారం మల్లాలమ్మ జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ చిత్తూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు పులివర్తి నాని మల్లాలమ్మను దర్శించుకున్నారు. మేదర సంఘం నాయకులు ఆయన్ను ఘనంగా సత్కరించారు.

ఘనంగా మహాగణపతి ఆలయ కుంభాభిషేకం

చంద్రగిరి, ఫిబ్రవరి 11: మండలంలోని రెడ్డివారిపల్లె పంచాయతీ శ్రీలక్ష్మినగర్ కాలనీలో ఆదివారం బలమూరి మహాగణపతి ఆలయ కుంభాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, కలశస్థాపన, హోమాలు, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణప్రతిష్ఠ, ఆలయ మహా కుంభాభిషేకం నిర్వహించి భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్మాణ దాత వెంకటరెడ్డి, అర్చకులు శివకుమార్‌శర్మ, సర్పంచ్ రేవతిప్రకాష్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన



పాకాల, ఫిబ్రవరి 11 : స్థానిక నీలామాలతి కల్యాణ మండపంలో ఆదివారం నిర్వహించిన మెగా వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. పులివర్తి నాని కోడలు డాక్టర్ పులివర్తి త్రిష్య రెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ల బృందం 1,100 మంది పిల్లలకు వైద్య పరీక్షలు నిర్వహించి, మెడికల్ కిట్లు అందజేశారు. పిల్లల ఆరోగ్యం కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. టీడీపీ అధికారంలోకి వచ్చాక మంచినీరు సరఫరా చేయిస్తామని, నాణ్యమైన విద్య, వైద్యం అందుబాటులోకి తెస్తామని, పాకాల ప్రభుత్వ ఆసుపత్రిలో చిన్నపిల్లల కోసం ప్రత్యేక విభాగం ఏర్పాటు చేయిస్తామని పులివర్తి సుధారెడ్డి హామీ ఇచ్చారు.

తలకోన బ్రహ్మోత్సవాల పోస్టరు ఆవిష్కరణ



ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి11: తలకోన సిద్ధేశ్వర స్వామి శివరాత్రి బ్రహ్మోత్సవాలకు సంబంధించిన పోస్టరును ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి ఆదివారం ఆవిష్కరించారు. ఆలయ పాలక మండలి సభ్యులు, ఈవో జయకుమార్, అర్చకులు ఎమ్మెల్యేను తిరుపతిలో కలిసి పోస్టరును ఆవిష్కరింపజేశారు.

నేడు ఎర్రావారిపాలెం మండల సమావేశం

ఎర్రావారిపాలెం, ఫిబ్రవరి 11 : మండల సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు స్థానిక వెలుగు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో మధుసూదన్‌రావు తెలిపారు. పంచాయతీ కార్యదర్శులు తమ గ్రామ వార్షిక అభివృద్ధి నివేదికలతో రావాలని పేర్కొన్నారు. అన్ని శాఖల అధికారులు సమావేశానికి హాజరై మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రోడ్డు కోసం పార్టీలకతీతంగా కదలిరండి

వేనాడు దీవిలో గ్రామస్తుల తీర్మానం



వేనాడులో రోడ్డుపై బైఠాయించి నిరసన చేస్తున్న యువకులు

తడ, ఫిబ్రవరి 11: 'మన గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కోసం అందరూ కదలి రండి... అంటూ ఆ గ్రామ యువకులు ఇచ్చిన పిలుపుకు అందరూ కదిలి వచ్చారు. మాకు రోడ్డు ముద్దు.. పార్టీలు వద్దు.. రోడ్డు వేస్తేనే ఓటు వేస్తాం... అంటూ వేనాడు పంచాయతీలోని వేనాడు, పల్లిపేటకుప్పం, మూల, ఆలాపత్రి, మట్టిగుంట, మొక్కపెళ్ల సెంటర్ గ్రామస్తులు తీర్మానం చేశారు. తడ మండలంలోని వేనాడు దీవిలోని ఆరు గ్రామాల గ్రామస్తులతో పాటు పార్టీలకతీతంగా నాయకులతో కలిసి యువత వేనాడు గ్రామంలో ఆదివారం సమావేశం నిర్వహిం చారు. ఇందులో టీడీపీ, వైసీపీ నాయకులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతూ అందరూ కలిసి పార్టీలను పక్కన పెట్టి తారురోడ్డు నిర్మాణం కోసం పోరాటం చేస్తామని పిలుపు నిచ్చారు. ఈ మేరకు కరపత్రాలు, పోస్టర్లు పలుచోట్ల అతికించారు.అనేక నిబంధనలతో తమ గ్రామాలకు తారురోడ్డు లేక అవస్థలు పడుతున్నామని, ఇందుకు అందరూ కలిసి పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామని ముందుకొచ్చారు. తమ గ్రామానికి తారురోడ్డు సౌకర్యం కల్పించకపోతే, ఓటు వేయబోమని, అవసరమైతే ఎన్నికలు కూడా బహిష్కరిస్తామని హెచ్చరించారు.ఈ సమావేశానికి విచ్చేసిన అందరూ ఒకే బాట.. ఒకే మాటలో పయనించి తారు రోడ్డు నిర్మాణం సాధించుకోవాలని తీర్మానం చేశారు. పార్టీలకు అతీతంగా ముందుకు సాగుదామన్నారు.గ్రామాల నుంచీ అందరూ వేనాడు దర్గా వద్దకు చేరుకొని అక్కడ రోడ్డు పై బైఠాయించి నిరసన తెలిపారు.


ఓటరు జాబితాలో తవ్వేకొద్దీ అక్రమాలు

● ఓటరు ఫొటో స్థానంలో ఆధార్, దరఖాస్తులు

తిరుచానూరు, ఫిబ్రవరి 11: చంద్రగిరి నియోజకవర్గ ఓటర్ల జాబితాలో అక్రమాలు తవ్వేకొద్దీ వెలుగులోకి వస్తున్నాయి. బూత్‌స్థాయి సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా తప్పులు రోజుకురోజుకూ వెలుగులోకి వస్తున్నాయి. తాజాగా జాబితాలో ఓటరు ఫొటో బదులు ఆధారుకార్డు, దరఖాస్తులు ముద్రించారు. పలువురి ఫొటోల స్థానంలో ఆధార్‌కార్డులు ప్రత్యక్షమవుతున్నాయి. చాలావరకు స్పష్టత లేని ఫొటోలు దర్శనమిస్తున్నాయి. కొన్ని చోట్ల ఓటరు ఫొటోలు లేకపోవడం గమనార్హం. ముఖ్యంగా తిరుచానూరు గ్రామ పంచాయతీ పోలింగ్ బూత్ 279లో 25మంది ఫొటోలు బదులు దరఖాస్తులు, ఆధార్‌కార్డులు దర్శనమిస్తున్నాయి. అదే పోలింగ్ బూత్‌లో జయశ్రీ(ఎపిక్ నెం.ఐఏఎక్స్ 0229898), సుమశ్రీ(ఎపిక్ నెంబరు ఐఏఎక్స్ 3347770) పేరు వద్ద ఫొటోలు లేవు. పాడిపేట పోలింగ్‌బూత్ 320లో ఇదే తరహాలో 20 ఓటర్ల పేర్లు వద్ద వారి ఫొటోలు లేకుండా ఆధార్‌కార్డులు, ఓటరు దరఖాస్తు ఫారాలు ముద్రించారు. చంద్రగిరి, తిరుపతి రూరల్ మండలాల్లోనూ ఈ తరహా వ్యవహారాలు దర్శనమిస్తున్నాయి. వీరందరూ నిజమైన ఓటర్లనేనా అనేది అధికారులు విచారణ జరిపి, నిజాలు తేల్చాలని ప్రజలు కోరుతున్నారు.

కలెక్టర్ ఆగ్రహం..విచారణకు ఆదేశం

తిరుచానూరులోని 292పోలింగ్ కేంద్రంలో 19 మంది చనిపోయినా వారిని ఓటరు జాబితా నుంచి తొలగించలేదు. 277వ కేంద్రంలో బతికున్న ఓటర్లను తొలగించారు. ఈ వ్యవహారాలపై ఆంధ్రజ్యోతిలో 'బతికున్నా ఓటరుగా చంపేశారు' అనే శీర్షికన శనివారం కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన కలెక్టర్ లక్ష్మీశా సంబంధిత అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విచారణ జరపాలని తిరుపతి ఆర్డీవో నిశాంత్‌రెడ్డిని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు.



ఓటర్ల జాబితాలో జయశ్రీ, సుమశ్రీ పేరు వద్ద కనిపించని ఫొటో

ఫొటో స్థానంలో ముద్రించిన దరఖాస్తులు

భారతి, హేమలత, ప్రభాకర్ ఫొటో బదులు ఆధారుకార్డు

బాలమేధస్సుతో భారతావనికి తేజస్సు



వైజ్ఞానిక ప్రదర్శనలో మొదటి స్థానంలో నిలిచిన లక్ష్మికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి/తొట్టంబేడు, ఫిబ్రవరి 11: బాలల మేధస్సు భవిష్యత్తులో భారతదేశానికి మరింత తేజస్సు తెస్తుందని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం జరిగిన జిల్లా ఇన్స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి 373 నమూనాలను ప్రదర్శనకు ఎంపిక చేశారు.వీటిలో 330 ఆవిష్కరణలు ప్రదర్శించగా ఆకట్టుకున్న 10శాతం ప్రయోగాలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రెండు రోజుల పాటు జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనను పెద్ద సంఖ్యలో విద్యార్థులు తిలకించారు.ముగింపు సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ 33 మంది విజేతలను ప్రకటించారు.ఇందులో భాగంగా కంచనపుత్తూరు ఎంపీయూపీ పాఠశాలకు చెందిన లక్ష్మి ప్రదర్శన మొదటి స్థానంలో నిలిచింది.చంద్రగిరి హైస్కూలుకు చెందిన పెంచల్ తేజ్ కుమార్ రెండో స్థానంలో, డక్కిలి మండలం తీర్థం పాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన పావని ప్రదర్శనలు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం ప్రశంసా పత్రాలు అందజేశారు. సీఎంవో సురేష్, జిల్లా ఇన్స్‌పైర్ పరిశీలకుడు దివ్యాన్స్, మహ్మద్ రాయిాషేక్, ఎంఈవోలు బాలయ్య, భువనేశ్వరి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అబ్బురపరిచిన ఆవిష్కరణలు

ముగిసిన ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలు అందరినీ అబ్బురపరిచాయి. శ్రీకాళహస్తిలో రెండు రోజుల పాటు జరిగిన జిల్లా ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌లో చిన్నారుల సృజనాత్మక రూపకల్పనలు ఆలోచింపజేశాయి.

సులభతరంగా నేల శుద్ధి

ఈ విద్యార్థి పేరు లక్ష్మి. బుచ్చినాయుడు కండ్రిగ మండలం కంచన పుత్తూరు ఎంపీయూపీ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఉపాధ్యాయులు జయకృష్ణ పర్యవేక్షణలో ఈజీ ఫ్లోర్ క్లీనర్ పరికరాన్ని రూపొందించింది. సహజంగా నేలను తుడిచేందుకు మాప్ వేసే విషయం తెలిసిందే.అయితే సబ్బు నీరు, బ్రష్ నిరుపయోగమైన ప్లాస్టిక్ డబ్బాలో అమర్చారు. పైన హ్యాండిల్‌కు స్విచ్ ఏర్పాటు చేశారు. స్విచ్‌తో సరిపడిన మోతాదులో సబ్బు నీరును విడుదల చేయడంతో పాటు, మోటారు అనుసంధానంతో కింద బ్రష్ నేలను శుద్ధి చేస్తుంది. ఇంట్లోనే తయారు చేసుకునే ఎంతో ఉపయోగకరమైన ఈ ప్రయోగం మొదటి స్థానంలో ఎంపికైంది.





లక్ష్మి ఆవిష్కరణ - పెంచల్ తేజ్‌కుమార్ ప్రదర్శన - వివరిస్తున్న పావని

ప్రశ్నపత్రాలు పదిలం

ఈ విద్యార్థి పేరు పెంచల్ తేజ్ కుమార్. చంద్రగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఉపాధ్యాయులు రామ్మూర్తి సహాయంతో ఎలక్ట్రిక్ ప్రొటెక్షన్ ఫర్ ఎగ్జామ్ పేపర్ ఆవిష్కరణను ప్రదర్శించారు. ఎన్ కోడింగ్, డీ కోడింగ్ సిద్ధాంతంపై స్ట్రాంగ్ రూమ్ నమూనాతో పరికరాన్ని తయారు చేశారు. ప్రశ్నపత్రాలను బయటకు తీయాలంటే ముందుగా ఎన్‌క్రిప్షన్ చేసిన అంకెల డిజిటల్ లాక్‌ను తెరవాలి. తప్పు అంకెలు నమోదు చేస్తే డిజిటల్ లాక్ తెరచుకోదు. అంతేకాకుండా అలారమ్ మోగిస్తుంది. ఈ విధానం ద్వారా పరీక్షల సమయంలో ప్రశ్నపత్రాల లీకేజీని నివారించవచ్చన్న ఆలోచనతో రూపొందించారు. ఈ ఎగ్జిబిట్ రెండవ స్థానంలో నిలిచింది.

సహజ పద్ధతిలో గృహశుద్ధి

ఈ విద్యార్థి పేరు పావని. డక్కిలి మండలం తీర్థం పాడు జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ఉపాధ్యాయులు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో మల్టీపర్పస్ నేచురల్ క్లీనర్ ఆవిష్కరణను ప్రదర్శించారు. నిమ్మరసం, గలుసు ఉప్పు, మరికొన్ని మిశ్రమాలతో ఇంట్లోనే సహజ పద్ధతిలో పౌడర్ తయారు చేశారు. దీనిద్వారా వంటింటి పాత్రలతో పాటు ఇంటి గోడలు నేలను కూడా శుభ్రం చేసుకోవచ్చు. రసాయనాల వాడకాన్ని నిర్మూలించి క్యాన్సర్‌ను అరికట్టవచ్చని విద్యార్థిని ఆలోచన. ఈ ప్రదర్శనకు మూడో స్థానం లభించింది.




సమ్మోహన నృత్యం

తిరుచానూరు, ఫిబ్రవరి 11: తిరుచానూరు రోడ్డులోని శిల్పారామంలో ఆదివారం జరిగిన నృత్య ప్రదర్శన ఆహూతులను సమ్మోహనపరిచింది. నారాయణపురానికి చెందిన అక్షర వేదసి నృత్య క్షేత్రానికి చెందిన కళాకారులు పలు అన్నమయ్య కీర్తనలకు నృత్యం చేశారు. శిల్పారామం ఏవో ఖాదరవల్లి వారిని అభినందించి జ్ఞాపికలు అందజేశారు.



మా కార్పొరేటర్ తండ్రి ఎవరో చెప్పండి?

తిరుపతి(తిలక్‌రోడ్), ఫిబ్రవరి 11: మా(3వ డివిజన్) కార్పొరేటర్ తండ్రి ఎవరో అధికారులు చెప్పాలని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి కృష్ణయాదవ్ ప్రశ్నించారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ తమ కార్పొరేటర్ గణేష్ కుమార్‌కు సీరియల్ నంబరు 237తో అకారంపల్లి రోడ్డులో సీరియల్ నంబరు 529తో శ్రీనివాసపురంలో ఓట్లు ఉన్నట్లు జాబితాలో చూపించారన్నారు. అయితే తండ్రి పేరు ఒకచోట సుబ్రహ్మణ్యం, మరోచోట మునికుమార్ అని ఉందని, ఇంతకీ ఆయన తండ్రి ఎవరో చెప్పాలని ప్రశ్నించారు. ఒక కార్పొరేటర్‌కు ఇద్దరు తండ్రులను సృష్టించిన ఘనత మన అధికారులకే దక్కిందని ఎద్దేవా చేశారు. తాము అడిగిన ప్రశ్నకు అధికారులు జవాబు చెప్పకపోతే పోలీసులకు, కలెక్టర్‌కు, కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టీడీపీ నాయకులు పెంచలయ్య, నాగరాజు, యశ్వంత్‌రెడ్డి, మనోహర్ ఆచారి, నీలిమ, శంకర్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో భవిష్యత్తు అంధకారం : నాని



తిరుపతి రూరల్, ఫిబ్రవరి 11: వైసీపీ పాలనలో చంద్రగిరి నియోజకవర్గ భవిష్యత్తు అంధకారంలో ఉందని టీడీపీ ఇన్‌చార్జి పులివర్తి నాని పేర్కొన్నారు. లింగేశ్వరనగర్‌లోని ఓంశక్తి ఆలయం నుంచి 'మీ ఇంటి వద్దకే మీ పులివర్తి నాని' కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నాలుగు పదవులు తీసుకున్నది వ్యక్తిగత లబ్ధికోసమా? నియోజకవర్గ అభివృద్ధి కోసమా? అని ప్రశ్నించారు. కనీసం నాయకులు, కార్యకర్తలైనా గుర్తున్నారా అని ప్రశ్నించారు. కొందరు సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు ప్రజలకు సమాధానం చెప్పలేక జనం మధ్యకు రాలేకపోతున్నారని తెలిపారు. ఎంపీపీలు, జడ్పీటీసీలు మానసిక క్షోభను అనుభవిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో ఒక పక్క దాడులు, దౌర్జన్యాలు, మరో పక్క ధరల బాదుడుతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వైసీపీ ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపాల్సిందేనని స్పష్టం చేశారు. ప్రభుత్వ అవసరాలకు, ప్రజల సౌకర్యాలకు నియోజకవర్గంలో సెంటు భూమి లేకుండా పోయిందన్నారు. తనకు ఒక్క అవకాశం ఇస్తే నియోజకవర్గాన్ని ఆదర్శంగా నిలుపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తిరుపతి రూరల్ టీడీపీ అధ్యక్షులు ఈశ్వర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

కొండపై ఏనుగుల కలకలం



పార్వేటమండపం వద్ద ఏనుగుల దాడిలో ధ్వంసమైన ఇనుపకంచె

తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): తిరుమలలో ఏనుగుల సంచారం కలకలం సృష్టించింది.పార్వేటమండపం సమీపంలో శనివారం రాత్రి ఏనుగులు అడవి నుంచి రోడ్డు దాటి డ్యాం వైపు వెళ్లాయి.అదే మార్గంలో తిరిగి అడవిలోకి వెళ్లిపోయాయి.ఏనుగుల పాదముద్రలు, లద్దెను బట్టి ఐదారు ఏనుగులుండవచ్చని అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.ఏనుగుల గుంపు పార్వేటమండపం పక్కనే వున్న శ్రీగంధ వనం ఇనుప కంచె, చెట్లను ధ్వంసం చేశాయి.రాత్రి వేళ పాపవినాశనం మార్గాన్ని టీటీడీ మూసివేస్తుంది కాబట్టి ఏనుగుల గుంపు సంచారం కారణంగా భక్తులకు ఇబ్బంది కలగలేదు. డ్యాంలో నీటిని తాగేందుకే ఏనుగులు వచ్చి వుంటాయని అధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది కూడా ఇదే సమయంలో ఏనుగుల గుంపు ఈ ప్రాంతంలో సంచరించడం గమనార్హం.



వైభవంగా పురశైవారితోటోత్సవం

తిరుమల, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి): శ్రీవైష్ణవ భక్తాగ్రేసరుడు, రామానుజచార్యుల శిష్యులలో ప్రముఖుడైన అనంతాళ్వారు 970వ అవతారోత్సవం తిరుమలలోని అనంతాళ్వారు తోటలో (పురశైవారితోట) ఆదివారం టీటీడీ ఆళ్వార్ దివ్య ప్రబంధ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతళ్వారు వంశీకులు 'నాలాయిర దివ్యప్రబంధ గోష్టిగానం' నిర్వహించారు. తిరుమల పెద్దజీయర్‌స్వామి అనుగ్రహభాషణం చేస్తూ 102 ఏళ్ల సుదీర్ఘ జీవన ప్రస్థానంలో స్వామి పుష్పకైంకర్యాన్ని ప్రారంభించి, ఉద్ధరించిన శ్రీవైష్ణ భక్తాగ్రేసరుడు అనంతాళ్వార్ అని కొనియాడారు. అనంతాళ్వారు వంశీకులు కొన్ని దశాబ్దాలుగా ఈ కార్యక్రమాన్ని కొనసాగించడం ముదావహమన్నారు. చిన్నజీయర్ మాట్లాడుతూ తిరుమలలో పుష్పాల తోటను ఏర్పరచి తన జీవితాన్ని భగవంతుడి పాదాల వద్ద పుష్పంగా సమర్పించుకున్నారని అనంతాళ్వార్ జీవిత వైశిష్ట్యం గురించి వివరించారు.

అయోధ్యకాండ పారాయణంతో మార్మోగిన తిరుమల గిరులు

తిరుమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): లోక కల్యాణార్థం శ్రీవారిని ప్రార్థిస్తూ తిరుమల నాదనీరాజనం వేదికపై ఆదివారం ఉదయం 7 నుంచి 9 గంటల వరకు ఏడవ విడత అయోధ్యకాండ అఖండ పారాయణంతో తిరుమలగిరులు మార్మోగాయి. 22 నుంచి 25 సర్గల వరకు 155 శ్లోకాలను పారాయణం చేశారు. యోగవాశిష్టం-ధన్వంతరి మహామంత్రంలోని 25 శ్లోకాలు పారాయణం చేశారు. వేదపండితులు అఖండ పారాయణం చేయగా భక్తులు వారిని అనుసరించారు. ధర్మగిరి వేదవిజ్ఞానపీఠానికి చెందిన ప్రముఖ పండితులు శేషాచార్యులు, అనంత, మారుతి, ధర్మగిరి వేదపాఠశాల, ఎస్వీ వేద విశ్వవిద్యాలయం అధ్యాపకులు, ఎస్వీ ఉన్నత వేద అధ్యయన సంస్థకు చెందిన వేద పారాయణదారులు, రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయానికి చెందిన పండితులు పాల్గొన్నారు. హైదరాబాద్‌కు చెందిన నాగరాజు బృందం రామనామ సంకీర్తన, అన్నమాచార్య ప్రాజెక్ట్ కళాకారుడు రఘునాథ్ బృందం 'పాహిరామ ప్రభో, పాహిరామ ప్రభో' సంకీర్తనను ఆలపించారు.

వెంకన్న సేవలో ప్రముఖులు

తిరుమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుభాష్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కోరుముట్ల శ్రీనివాసులు, సినీ నటి అనుసూయ భరద్వాజ్ ఉన్నారు. వీరికి ఆలయాధికారులు ప్రత్యేక దర్శనం కల్పించి, లడ్డూప్రసాదాలు అందజేశారు.

అధికారుల సహకారం మరువలేనిది : ఎస్పీ



ఎస్పీ దంపతులను సన్మానిస్తున్న పోలీసు అధికారులు

తిరుపతి(నేరవిభాగం), ఫిబ్రవరి 11: జిల్లా అధికారులు, సిబ్బంది సహకారం మరువలేనిదని ఎస్పీ పరమేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ఆయన్ను ఒంగోలు జిల్లాకు బదిలీచేస్తూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన నేపథ్యంలో ఆదివారం కచ్చపి ఆడిటోరియంలో ఆత్మీయ వీడ్కోలు సభ ఏర్పాటు చేశారు. పోలీసు అధికారులు ఆయన్ను శాలువాతో సత్కరించారు. నాయకత్వ పటిమతో జిల్లా పోలీసు యంత్రాంగాన్ని సమర్థవంతంగా నడిపించారని కొనియాడారు. ఎస్పీ మాట్లాడుతూ జిల్లాతో తనకు మంచి అనుబంధం ఏర్పడిందన్నారు. అధికారుల నుంచి సిబ్బంది వరకు అందరూ సహకరించారని తెలిపారు. అదనపు ఎస్పీలు వెంకటరావు, కులశేఖర్, విమలకుమారి, శివరామిరెడ్డి, సెబ్ ఏఎస్పీ రాజేంద్ర, ట్రైనీ ఏఎస్పీ దేవరాజ్‌మనీష్‌పాటిల్, డీఎస్పీలు, సీఐలు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

తిరుపతి

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు

తిరుమల, ఫిబ్రవరి 11 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.51 కోట్లు లభించింది. శుక్రవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ శనివారం లెక్కించి ఆదివారం ఉదయం ప్రకటించింది. ఇక, శనివారం 70,158 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 24,801 మంది తలనీలాలు సమర్పించారు.

ఒకటి నుంచి కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు

తిరుపతి (కల్చరల్), ఫిబ్రవరి 11: కపిలతీర్థంలోని కపిలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు మార్చి 1వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు టీటీడీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. ఫిబ్రవరి 29వ తేదీన అంకురార్పణతో ఉత్సవాలు మొదలవుతాయి. ప్రతిరోజూ ఉదయం 7నుండి 9 గంటల వరకు, రాత్రి 7నుంచి 9 గంటల వరకు వాహన సేవలు ఉంటాయి. టీటీడీకి చెందిన హిందూధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో రోజూ కోలాటాలు, భజనలు, అన్నమాచార్య ప్రాజక్టు ఆధ్వర్యంలో సంగీత కార్యక్రమాలు ఉంటాయని పేర్కొంది.

ఘంటసాల ధన్యజీవి







తిరుపతి (కల్చరల్), తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 11: అమర గాయకుడు ఘంటసాల ధన్యజీవి అని పలువురు ప్రముఖులు పేర్కొన్నారు. ఆదివారం సినీ నేపథ్య గాయకుడు ఘంటసాల వేంకటేశ్వరరావు 50వ వర్ధంతిని పురస్కరించుకుని వీవీ మహల్ కూడలిలోని విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఆయన గానమాధుర్యాన్ని స్మరించుకున్నారు. రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో పలువురు రంగస్థల కళాకారులు ఘంటసాలకు నివాళి అర్పించారు. కేఎస్ రాజ, ఉపాధ్యాయుడు తిరుమలయ్య, పాటిబండ మురళి, తిరుపాలాచారి, తొండమనాటి సుబ్రమణ్య రెడ్డి, సింగంశెట్టి సుబ్బరామయ్య పాల్గొన్నారు. ప్రముఖ గాయకుడు సోము ఉమాపతిని సత్కరించారు. తిరుపతిలోని ఘంటసాల గాన కళాపీఠం ఆధ్వర్యంలో అధ్యక్షుడు మల్లం విజయకుమార్ రెడ్డి, రాయలసీమ పోరాట సమితి నేత నవీన్‌కుమార్ రెడ్డి, శ్రీకాళహస్తి ఆలయ పాలకమండలి సభ్యుడు మహిధర్ రెడ్డి ఘంటసాలకు నివాళి అర్పించారు. పురుషోత్తం, లవకుమార్, రామచంద్రారెడ్డి, సోమశేఖర్ రెడ్డి పాల్గొన్నారు. తిరుపతి ఫిలిమ్ సొసైటీ ఆధ్వర్యంలో భవానీనగర్ కూడలిలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. శ్లోకాలు, పాటలు ఆలపించి అభిమానం చాటుకున్నారు. ముఖ్య అతిథిగా వచ్చిన సినీ నిర్మాత యలమంచలి ప్రవీణ్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఫిలిమ్ సొసైటీ అధ్యక్షుడు వై.ఎస్.బాబు, ప్రధాన కార్యదర్శి శేషగిరిరావు, కోశాధికారి ప్రసాదరావు, బుచ్చిబాబు, శంకర్, శాంతవాణి, అనసూయ, సుబ్రహ్మణ్యం, సోము, ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఆశా వర్కర్లు

తిరుపతి(కొర్లగుంట)/తిరుపతి సిటీ, ఫిబ్రవరి 11: ఆశావర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎస్‌డబ్ల్యూఎఫ్ఐ జాతీయ అధ్యక్షురాలు టి.సి.రమ డిమాండ్ చేశారు. ఆలిండియా యునైటెడ్ ట్రేడ్ యూనియన్ సెంటర్ అనుబంధ ఆంధ్రప్రదేశ్ యునైటెడ్ ఆశావర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం తిరుపతిలో రాష్ట్ర మహాసభలు నిర్వహించారు. తొలుత బాలాజీకాలనీ అంబేడ్కర్ భవన్ నుంచి ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఆశావర్కర్లను రాజకీయ కార్యక్రమాల్లో భాగస్వామ్యం చేస్తూ పని ఒత్తిడి పెంచుతున్నారని తెలిపారు. వారికి ఉద్యోగ, ఆరోగ్య భద్రత కల్పించాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర ఇన్‌చార్జ్ ఎల్.సుధీర్ మాట్లాడుతూ ఆశావర్కర్లు 12గంటలు పనిచేస్తూ చాలీచాలని జీతాలతో జీవితం గడుపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కనీసం వారికి రూ.35వేలు జీతం చెల్లించాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోసం కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేయాల్సి ఉంటుందని పిలుపునిచ్చారు.

ఆశా వర్కర్ల రాష్ట్ర కమిటీ ఎంపిక : ఆశావర్కర్ల రాష్ట్ర కమిటీ గౌరవాధ్యక్షులుగా కె.కుమార్‌రెడ్డి, అధ్యక్షురాలిగా ఎస్.జహీరా, ఉపాధ్యక్షులుగా కె.పవనమ్మ, జి.కవిత, కార్యనిర్వాహక కార్యదర్శిగా టి.మునేంద్ర, కోశాధికారిగా హరీష్, నలుగురు సహాయ కార్యదర్శులు, ఐదుగురు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

అప్సా రాష్ట్ర కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న సుబ్రమణ్యంరాజు, ఇతర కార్యవర్గ ప్రతినిధులు

తిరుపతి(విద్య), ఫిబ్రవరి 11: స్థానిక రీనెస్ట్ హోటల్‌లో ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్(అప్సా) రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడిగా తిరుపతికి చెందిన శ్రీనివాస ఇంగ్లిషు మీడియం స్కూల్ కరస్పాండెంట్ వి.సుబ్రమణ్యంరాజుతో పాటు ఇతర కార్యవర్గ ప్రతినిధులు ప్రమాణ స్వీకారం చేశారు. సుబ్రమణ్యం రాజు మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలల సమస్యల పరిష్కారంతో పాటు సంఘ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని తెలిపారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ ఎల్.రమేష్‌బాబు, లోకేష్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, జోన్, జిల్లా కార్యవర్గప్రతినిధులు హాజరై నూతన కార్యవర్గ ప్రతినిధులను సన్మానించారు. నాయకులు రవిచంద్రారెడ్డి, రాజారెడ్డి, రవి, రాజేష్, రాజు, గంగయ్య, హేమకుమార్, మురళీమోహన్, చంద్రశేఖర్, విజయ్, రామకృష్ణ, మాధవి, తేజస్వి, గౌతమి పాల్గొన్నారు.

మాజీ సైనికులకు ఇంటిస్థలాలు మంజూరు చేయండి



సమావేశంలో మాట్లాడుతున్న సురేష్‌కుమార్

తిరుపతి(ఆటోనగర్) ఫిబ్రవరి 11 : రాష్ట్రంలోని మాజీ సైనికులకు జీవో 1241 మేరకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని ఆలిండియా ఎక్స్ సర్వీస్‌మెన్ ఫెడరేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్.సురేష్‌కుమార్ డిమాండ్ చేశారు. తిరుపతి-తిరుచానూరు మార్గంలోని శిల్పారామంలో ఆదివారం ఫెడరేషన్ రాష్ట్ర వార్షిక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశ భద్రత కోసం 15-30 ఏళ్ల సరిహద్దుల్లో సేవలందించామన్నారు. రిటైర్డ్ అయిన తర్వాత కూడా చాలామంది ప్రభుత్వ సంస్థల్లో సేవలందిస్తున్నారని వెల్లడించారు. జీఓ మేరకు మాజీ సైనికులకు 172 గజాల స్థలాన్ని ప్రభుత్వం నిర్ణయించిన ధరకు మంజూరు చేయాలన్నారు. జాతీయ బ్యాంకుల్లో పనిచేస్తున్న మాజీ సైనికోద్యోగులకు క్యాడర్లవారీగా వేతన సవరణ చేయాలని డిమాండ్ చేశారు. జాతీయ అధ్యక్షుడు ప్రవీణ్‌శర్మ మాట్లాడుతూ బ్యాంకుల్లో పనిచేస్తున్న మాజీ సైనికోద్యోగులను 40 కిలోమీటర్ల లోపు బదిలీ చేసేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ప్రతి జిల్లాలోనూ వార్ మెమోరియల్ స్థూపం ఏర్పాటు చేయాలన్నారు. గుర్తింపు పొందిన కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్య సదుపాయం కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు పి.కిరణ్‌కుమార్, రాజు, పి.చంద్రశేఖర్, జి.రవికుమార్, ఆర్‌కె సింగ్, శ్రీకాంత్, ఢిల్లీరావు, వాసు, మురళి, ప్రవీణ్ , హరి, సుధాకర్‌రాజు, నిరంజన్, జనార్దన్, శివయ్య, గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో టీటీడీ పరిచారకుడి మృతి



యతీరాజ నరసింహన్ (ఫైల్ ఫొటో)

తిరుమల, ఫిబ్రవరి11 (ఆంధ్రజ్యోతి): తిరుమల మొదటి ఘాట్ రోడ్డులో ఆదివారం జరిగిన ప్రమాదంలో శ్రీవారి ఆలయంలో పనిచేసే పరిచారకుడు మృతి చెందాడు. ఆలయంలోని సబేరాలో పరిచారికగా పనిచేసే యతీరాజ నరసింహన్(43) విధులను పూర్తి చేసుకుని ఆదివారం మధ్యాహ్నం ద్విచక్ర వాహనంలో తిరుపతికి బయలుదేరాడు. 37వ మలుపు వద్ద ఆర్టీసీ బస్సును బైక్ ఢీకొంది. యతీరాజకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసులు, విజిలెన్స్ అధికారులు ఘటనా ప్రాంతానికి చేరుకుని కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తిరుపతికి తరలించారు.



ఘటనా ప్రాంతంలో యతీరాజ నరసింహన్ మృతదేహం

16న బంద్‌కు రాజకీయ పార్టీల మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 11: ఈనెల 16న జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్స్, సంయుక్త కిసాన్ మోర్చా సంఘాలు తలపెట్టిన బంద్‌ను జయప్రదం చేయాలని వివిధ రాజకీయ పార్టీలు నిర్ణయించాయి. ఆదివారం సీపీఐ కార్యాలయంలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఈ మేరకు ఆయా పార్టీల నేతలు తీర్మానించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పి.మురళి, సీపీఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు, టీడీపీ నుంచి ఆర్సీ మునికృష్ణ, సీపీఐ ఎంఎల్ నుంచి రామిశెట్టి వెంకయ్య పాల్గొని ప్రసంగించారు. 16 సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే ఈ బంద్‌ను జయప్రదం చేయాలని తీర్మానించామన్నారు. రెండోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా కార్మిక రైతాంగ వ్యతిరేక విధానాలను శరవేగంగా అమలుచేస్తోందన్నారు. లాభసాటిగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయించే ప్రయత్నం చేస్తోందన్నారు. ఉపాధి హామీ కూలీలకు కూలి రూ.600కు పెంచాలని, 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.చంద్రశేఖర్‌రెడ్డి, నగర ప్రధాన కార్యదర్శి ఎస్.డి.రవి పాల్గొన్నారు.

రూ.16 కోట్లతో హాస్టల్ సముదాయం

● పనులను ప్రారంభించిన వీసీ శ్రీకాంత్ రెడ్డి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 11: యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ పరిధిలో రూ.16 కోట్లతో హాస్టల్ సముదాయాన్ని నిర్మించనున్నారు. ఇందుకు సంబంధించిన శంకుస్థాపన ఆదివారం నిర్వహించారు. వీసీ శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల సంఘం ఈ నిధులను సమకూర్చిందన్నారు. 500 మంది విద్యార్థులకు వసతి సామర్థ్యంతో ఈ సముదాయాన్ని నిర్మిస్తామని తెలిపారు. మాజీ వీసీ ప్రొఫెసర్ రాజారెడ్డి పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న వీసీ తదితరులు



ఆస్ట్రేలియాలో మలబార్ షోరూం ప్రారంభంపై హర్షం

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 11 : ఆస్ట్రేలియా రాజధాని సిడ్నీలో మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూం ప్రారంభించడంపై తిరుపతి షోరూం హెడ్ రిజీష్ ఓ ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. ఆస్ట్రేలియా మాజీ క్రికెటర్ బ్రెట్‌లీ ఈ షోరూంను ప్రారంభించారని పేర్కొన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్‌కు వివిధ దేశాలలో 340కు పైగా షోరూంలు ఉన్నాయని తెలిపారు.

సెమినార్ హాల్ ప్రారంభం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఫిబ్రవరి 11: ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో రూ.10 లక్షలతో ఆధునికీకరించిన సెమినార్ హాల్‌ను వీసీ ప్రొఫెసర్ శ్రీకాంత్ రెడ్డి ఆదివారం ప్రారంభించారు. 200 మంది సామర్థ్యంతో ఈ హాల్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు తెలిపారు. యూనివర్సిటీ రిటైర్డు ప్రొఫెసర్ రఘునాథరెడ్డి ఆర్థిక సహకారం అందించినట్టు చెప్పారు. మాజీ వీసీ ప్రొఫెసర్ రాజారెడ్డి పాల్గొన్నారు.

పండిట్ దీన్‌దయాళ్‌కు నివాళి



తిరుపతి(ఉపాధ్యాయనగర్), ఫిబ్రవరి 11: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్.ఎస్.ఎస్) మాజీ అధ్యక్షుడు పండిట్ దీన్‌దయాళ్ వర్ధంతిని పురస్కరించుకుని బీజేపీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. జీఎస్ మాడ వీధిలో ఆదివారం బీజేపీ నాయకులు దీన్‌దయాళ్ చిత్రపటానికి పూలమాలలువేసి అంజలి ఘటించారు. ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు గుండాల గోపినాథ్‌రెడ్డి, పాటిబండ్ల మురళి, సుబ్రహ్మణ్యంరెడ్డి, డీఎంకే గణేష్, సురేష్‌స్వామి పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఎన్నికలపైనా విచారణ జరగాలి

తిరుపతి, ఫిబ్రవరి11(ఆంధ్రజ్యోతి) : దేశాన్ని కుదిపేస్తున్న దొంగ ఓట్ల కుంభకోణం తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సమయంలోనే జరిగిందన్న అనుమానాలున్నాయని టీడీపీ 35వ డివిజన్ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ అభిప్రాయపడ్డారు. బోగస్ ఎపిక్ కార్డులు డౌన్‌లోడ్ ఎప్పుడు చేశారో, ఎక్కడ తయారు చేశారో విచారణ జరపాలన్నారు. కార్పొరేషన్ ఎన్నికల్లోనూ అధికార పార్టీ పెద్దఎత్తున దొంగ ఓట్లకు పాల్పడిందని, విపక్ష పార్టీలను నామినేషన్లు వేయనీయకుండా అడ్డుకున్నారని గుర్తుచేశారు. ఏయే డివిజన్లలో అక్రమంగా ఎన్నికలు జరిగాయో వాటిని రద్దుచేసి, కార్పొరేటర్ల సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండు చేశారు. కోఆపరేటివ్ బ్యాంకు ఎన్నికలు కూడా దొంగ ఓట్లమయమేనన్నారు.

విద్యుత్ కార్మికుల ధర్నాలో పాల్గొనవద్దు



కందారపు మురళికి నోటీసు అందజేస్తున్న పోలీసులు

తిరుపతి(కొర్లగుంట), ఫిబ్రవరి 11: సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం విజయవాడలో తలపెట్టిన విద్యుత్ కార్మికుల ధర్నాకు హాజరుకావద్దని అలిపిరి పోలీసులు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి, కొందరు నేతలకు, విద్యుత్ కార్మికులకు ఆదివారం రాత్రి నోటీసులు అందజేశారు. కందారపు మురళి మాట్లాడుతూ విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులకు ఎన్నికలకు ముందు జగన్ ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా తాజా పీఆర్సీ ప్రకారం వేతనాలు కూడా పెంచలేదన్నారు. సమస్యలు పరిష్కరించాలని ఆందోళనకు పిలుపు ఇచ్చినప్పుడల్లా నిర్బంధాన్ని ప్రయోగించడం ప్రభుత్వానికి ఆనవాయితీగా మారిపోయిందన్నారు. ఎవరెన్ని ఆటంకాలు కల్పించినా విజయవాడ ధర్నాచౌక్ వద్ద వేలాది మందితో నిరసన తెలియజేస్తామని స్పష్టం చేశారు.


క్షతగాత్రులకు చికిత్స అందిస్తున్న వైద్య సిబ్బంది

లారీని ఢీకొన్న బస్సు
పదిమందికి గాయాలు


ముందుభాగం దెబ్బతిన్న బస్సు

నాయుడుపేట టౌన్, ఫిబ్రవరి 11: నాయుడుపేట - విన్నమాల జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని వెనుక నుంచి ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో పది మందికి గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... తిరుపతి నుంచి ఏలూరుకు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఆదివారం తెల్లవారుజామున నాయుడుపేట - విన్నమాల జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న లారీని ఢీ కొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్ అశోక్, ప్రయాణికులు విజయలక్ష్మి, ప్రసన్నకుమారి, విజయచాముండేశ్వరి, యశోదతో పాటు మరో ఐదుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స అందించారు. వాహనాలు భారీగా నిలిచిపోవడంతో సంఘటనాస్థలికి చేరుకున్న పోలీసులు ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కల్వర్టుపై గొయ్యి... తరచూ ప్రమాదాలు


కల్వర్టుపై ఉన్న గొయ్యి

గూడూరు, ఫిబ్రవరి 11: స్థానిక నలజాలమ్మ వీధిలో కల్వర్టుపై గొయ్యి ఏర్పడడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. నలజాలమ్మవీధి ప్రధాన రహదారి కావడంతో వాహనాల రాకపోకలు ఎక్కువగా సాగుతుంటాయి. రాత్రి సమయంలో గొయ్యి కనిపించక వాహనదారులు, పాదచారులు ప్రమాదాలకు లోనవుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి కల్వర్టుపై గొయ్యిని పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

ఆమ్‌ఆద్మీ పార్టీతోనే అభివృద్ధి


ప్రచారం చేస్తున్న ఆమ్‌ఆద్మీ నేతలు

నాయుడుపేట, ఫిబ్రవరి 11: ఆమ్‌ఆద్మీ పార్టీతోనే అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు పాలేటి వెంకటస్వామి అన్నారు. నాయుడుపేటలో ఆమ్‌ఆద్మీ పార్టీ సామాన్యుడి శంఖారావ ప్రజాచైతన్య యాత్ర నిర్వహించారు. ఆమ్‌ఆద్మీ పార్టీ అధికారంలోకి వస్తే మహిళలకు సంపూర్ణ భద్రత, ఉచిత బస్సు ప్రయాణం, యువతకు ఉపాధి, రైతులకు తక్కువ వడ్డీతో రుణాలు, గిట్టుబాటు ధరలతో పాటు అవినీతి రహిత పాలన అందిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పట్టపు రవి, మోహన్‌రాజు, చిరంజీవి, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామీణాభివృద్ధి


బీజేపీ జెండా ఆవిష్కరిస్తున్న పార్టీ నేతలు

పెళ్లకూరు, ఫిబ్రవరి 11: బీజేపీతోనే గ్రామీణాభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నూరిపాకల ముని సుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షుడు ఎద్దల నరేంద్రరెడ్డి పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని పెన్నేపల్లి గ్రామంలో పల్లెకు పోదాం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో పార్టీ జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు గోగుతోట్టి మురళి, ప్రధాన కార్యదర్శి నరసింహయాదవ్, సుమన్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి చేయండి

గూడూరు, ఫిబ్రవరి 11: బీజేపీ బలోపేతానికి యువత ముందుకు రావాలని ఆ పార్టీ నియోజకవర్గ కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి అన్నారు. బీజేపీలో చేరిన యువ వ్యాపారవేత్తలు దయాకర్, రాఘవేంద్ర, సురేష్‌ను ఆదివారం అభినందించారు. ఈ సందర్భంగా పురుషోత్తమరెడ్డి మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించడంతో పాటు ప్రజల సంక్షేమానికి పలు కార్యక్రమాలను చేపడుతున్నారన్నారు. రానున్న ఎన్నికలలో బీజేపీని గెలిపించాలన్నారు. కార్యక్రమంలో ఆరికట్ల బాలకృష్ణమనాయుడు, నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి

నాయుడుపేట, ఫిబ్రవరి 11: నాయుడుపేట మండలం మేనకూరు పంచాయతీ పరిధిలోని చలివేంద్ర గ్రామంలో ప్రభుత్వ భూములను కొందరు కబ్జా చేసి అక్రమంగా వాణిజ్య సముదాయాలు నిర్మిస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. ఆదివారం వారు మాట్లాడుతూ నాయుడుపేట - వెంకటగిరి రహదారికి ఇరువైపుల లక్షల రూపాయల విలువచేసే భూములను కొందరు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని తెలిపారు. ఈ విషయం రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో వారు సర్వే నెంబరు 171-6లో హెచ్చరిక బోర్డు పెట్టారని, అయినా అక్రమ నిర్మాణాలు జరుగుతూనే ఉన్నాయని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని చలివేంద్ర గ్రామస్తులు కోరుతున్నారు.

ధాన్యం ధరలు ఢమాల్


ధరలు పడిపోతుండటంతో కల్లాల్లోనే ధాన్యాన్ని అమ్మేస్తున్న రైతులు

కోట, ఫిబ్రవరి 11: మొన్నటి వరకు మోస్తరుగా పలికిన ధాన్యం ధరలు ఆదివారం నుంచి తగ్గుముఖం పట్టాయి. పుట్టి ధాన్యంపై ఏకంగా 2వేల రూపాయలు తగ్గిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు. బయట మార్కెట్‌లో బీపీటీ 5204(పెద్దజిలకర్ర) ధరలు పడిపోతున్నాయంటూ బ్రోకర్లు కారుచౌకగా ధాన్యం కొనుగోలు చేస్తున్నారని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నేడు ఉన్న ధర రేపటికి ఉంటుందో లేదో అన్న అనుమానంతో రైతులు కల్లాల్లోనే ధాన్యాన్ని ఆమ మేఘాలపై అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. సముద్రతీర ప్రాంతాలైన కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో ఈ రబీ సీజన్‌లో రైతులు బీపీటీ 5204(పెద్ద జీలకర్ర) ఎక్కువగా సాగు చేశారు. పంటల కోతలు ప్రారంభమయ్యాక మొదటల్లో ధాన్యం ధరలు పెరగడంతో రైతుల ఆనందపడ్డారు. మొన్నటి వరకు 5204 రకం ధాన్యం పుట్టి రూ.24,500 పలకగా ఆదివారం రూ.22,500లకు పడిపోవడంతో రైతులు లబోదిబోమంటున్నారు.

దిగుబడులూ అంతంత మాత్రమే

పెళ్లకూరు: మండలంలోని బీపీటీ 5204, ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638 రకాల వరికి అగ్గి తెగుళ్లతో పాటు దోమపోటు తెగుళ్ల ఆశించడంతో దిగుబడులపై తీవ్ర ప్రభావం చూపింది. ఎకరాకు 40నుంచి 45 బస్తాల దిగుబడి వచ్చేది. ప్రస్తుతం దోమపోటు కారణంగా 25 నుంచి 30 బస్తాలు మాత్రమే దిగుబడి రావడంతో ఆరుగాలం కష్టపడి పంటలు పండించిన రైతులు దిగాలు చెందుతున్నారు. మరోవైపు దళారులు ధాన్యానికి తగిన డిమాండ్ లేదంటూ తక్కువ ధరకు కొనుగోలు చేస్తూ దోపిడీ చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రైతులు కోరుతున్నారు.

కాళంగి కలుషితం
- నది ఆనుకొనే డంపింగ్‌యార్డు
- నీటిలో కలుస్తున్న వ్యర్థాలు


కాళంగి నది ఒడ్డున డంప్ చేసిన చెత్త

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11: వేలాది ఎకరాలకు సాగునీరందించే రైతుల వరప్రసాదిని కాళంగి నది కలుషితమైపోతోంది. ప్రఖ్యాతిగాంచిన షార్ కేంద్రం పక్కనే ఉన్న సూళ్లూరుపేట మున్సిపాలిటీకి డంపింగ్ యార్డు కరువైంది. దీంతో జాతీయ రహదారి పక్కనే కాళంగి నదిని ఆనుకొని చెత్త, వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో 45 వేలకు పైబడి జనాభా ఉంది. రోజుకు 65 టన్నులకు పైగా చెత్త పోగవుతోంది. రోజువారీ సేకరించిన ఎత్తను హోలిక్రాస్ సమీపంలోని జాతీయ రహదారి పక్కనే కాళంగి నదిని ఆనుకొని ఉన్న డంపింగ్ చేస్తున్నారు. ఈ చెత్త కాళంగిలో కలుస్తుండడంతో నది కలుషితమవుతోంది. అంతేకాకుండా అక్కడే చెత్తకు నిప్పుపెట్టడంతో పట్టణమంతా పొగ వ్యాపిస్తోంది. ఈ దుర్వాసనతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా పట్టణంలోని బోర్లు, బావుల్లో కూడా కలుషిత నీరు వస్తోందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై పలుమార్లు మున్సిపాలిటీ అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదని పట్టణవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని రెవెన్యూ అధికారులకు పలుసార్లు మొరపెట్టుకొన్నా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి టీడీపీని గెలిపించండి


పోస్టర్లు విడుదల చేస్తున్న తెలుగు మహిళలు, యువత

గూడూరు, ఫిబ్రవరి 11: రాష్ట్రాభివృద్ధిని కాంక్షించి ప్రతిఒక్కరూ టీడీపీని గెలిపించాలని తెలుగు మహిళలు, యువత నేతలు అన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ కార్యాలయంలో తెలుగు మహిళలు, యువత ఆధ్వర్యంలో మై ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈనెల 15వ తేదీలోపు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో అనేక పరిశ్రమలను ఏర్పాటు చేయడంతో పాటు ఐటీ రంగాన్ని ప్రోత్సహించి ఎన్నో లక్షలమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం యువతకు ఉపాధి అవకాశాలు కల్పించకుండా మోసం చేసిందన్నారు. కార్యక్రమంలో మట్టం శ్రావణి, గుండాల లీలావతి, ప్రణీత్, సునీల్, సందీప్, కల్యాణ్, వెంకటసాయి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

చెంగాళమ్మకు వెండి కిరీటం బహూకరణ


ఆలయ సిబ్బందికి కిరీటాన్ని అందజేస్తున్న శంకర్

సూళ్లూరుపేట, ఫిబ్రవరి 11: చెంగాళమ్మ పరమేశ్వరికి శ్రీకాళహస్తికి చెందిన కె.శంకర్ అనే భక్తుడు ఆదివారం 275 గ్రాముల వెండి కిరీటాన్ని బహూకరించారు. ఆదివారం ఆలయంలోని కార్యాలయ సిబ్బంది కామేశ్వరరావుకు కిరీటాన్ని అందజేశారు. ఆలయ ట్రస్టుబోర్డు సభ్యులు ముప్పాళ్ల చంద్రశేఖర్ రెడ్డి, కర్లపూడి సురేష్ పాల్గొన్నారు.

బాలమేథస్సుతో భారతావనికి తేజస్సు


వైజ్ఞానిక ప్రదర్శనలో మొదటి స్థానంలో నిలిచిన లక్ష్మికి ప్రశంసాపత్రం అందజేస్తున్న ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం

శ్రీకాళహస్తి/తొట్టంబేడు, ఫిబ్రవరి 11: బాలల మేధస్సు భవిష్యత్తులో భారతదేశానికి మరింత తేజస్సు తెస్తుందని ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం అన్నారు. శ్రీకాళహస్తి పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం సాయంత్రం జరిగిన జిల్లా ఇన్స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన ముగింపు సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి 373 నమూనాలను ప్రదర్శనకు ఎంపిక చేశారు.వీటిలో 330 ఆవిష్కరణలు ప్రదర్శించగా ఆకట్టుకున్న 10శాతం ప్రయోగాలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. రెండు రోజుల పాటు జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనను పెద్ద సంఖ్యలో విద్యార్థులు తిలకించారు.ముగింపు సమావేశంలో జిల్లా సైన్స్ అధికారి భానుప్రసాద్ 33 మంది విజేతలను ప్రకటించారు.ఇందులో భాగంగా కంచనపుత్తూరు ఎంపీయూపీ పాఠశాలకు చెందిన లక్ష్మి ప్రదర్శన మొదటి స్థానంలో నిలిచింది.చంద్రగిరి హైస్కూలుకు చెందిన పెంచల్ తేజ్ కుమార్ రెండో స్థానంలో, డక్కిలి మండలం తీర్థంపాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన పావని ప్రదర్శనలు మూడో స్థానంలో నిలిచాయి. విజేతలకు ఎమ్మెల్సీ సుబ్రహ్మణ్యం ప్రశంసాపత్రాలు అందజేశారు. సీఎంవో సురేష్, జిల్లా ఇన్స్పైర్ పరిశీలకుడు దివ్యాన్స్, మహ్మద్ రాయాష్‌షేక్, ఎంఈవోలు బాలయ్య, భువనేశ్వరి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.


రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

బంద్‌ను విజయవంతం చేయండి



సమావేశంలో మాట్లాడుతూ రమణయ్య

గూడూరు, ఫిబ్రవరి 11: కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న బంద్‌ను విజయవంతం చేయాలని సీఐటీయూ ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు బీవీ రమణయ్య అన్నారు. ఆదివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆటో డ్రైవర్ల యూనియన్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హిట్ అండ్ రన్ కేసుల్లో డ్రైవర్లకు పది సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా విధించేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాన్ని రద్దు చేయాలన్నారు. అనంతరం ఆటో డ్రైవర్ల యూనియన్ పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహబూబ్‌బాషా, కార్యదర్శిగా కాలేషా, ఉపాధ్యక్షుడుగా కార్యక్రమంలో భాస్కర్, ట్రెజరర్‌గా ప్రసాద్, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో రమేష్ తదితరులు పాల్గొన్నారు. అలాగే సీపీఎం కార్యాలయంలో వామపక్షాల ఆధ్వర్యంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈనెల 16వ తేదీన నిర్వహించనున్న గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శివకుమార్, శశికుమార్, వెంకట్రామిరెడ్డి, బీవీ రమణయ్య, సురేష్, ప్రసాద్, గోపీనాథ్, కోటేశ్వరరావు, శంకరయ్య, మధు, శ్రీనివాసులు, ఉష, చంద్రయ్య, రాధాకృష్ణ, ప్రభాకర్, సీవీఆర్ కుమార్, భాస్కర్, శ్రీరాములు, చంద్రయ్య, నారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

హక్కులు కల్పించాలని ఆర్డీవోకు వినతి


ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

గూడూరు, ఫిబ్రవరి 11: డక్కిలి మండలం మోపూరు గ్రామంలో తాము సాగు చేసుకుంటున్న భూములపై హక్కులు కల్పించాలంటూ గిరిజనులు ఆర్డీవో కిరణ్‌కుమార్‌కు విన్నవించారు. ఆదివారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయంలో ఆర్డీవోను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో చిరంజీవి, వెంకటాద్రి, చెంగయ్య, గీత తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల కార్యవర్గం ఎన్నిక


విశ్రాంత ఉద్యోగుల నూతన కార్యవర్గ సభ్యులు

గూడూరు, ఫిబ్రవరి 11: రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మహబూబ్ బాషా, ప్రధానకార్యదర్శి మోహన్, కోశాధికారిగా కృష్ణయ్య, అసోసియేట్ అధ్యక్షులుగా భాస్కర్‌రావు, పురుషోత్తమరావు, సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా గోపాల్, సహాయ ఎన్నికల అధికారిగా చెంగల్‌రాయులు, పర్యవేక్షకులుగా లక్ష్మీనారాయణ, జయరామనాయుడు, కృపావరమ్మ వ్యవహరించారు.

వైసీపీ విజయానికి కృషి చేయండి

గూడూరు, ఫిబ్రవరి 11: రానున్న ఎన్నికల్లో వైసీపీ గెలిపించేందుకు ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని నియోజకవర్గం సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని రామలింగాపురం, మిటాత్మకూరు, సంతదాసుపల్లి, విందూరు తదితర గ్రామాల్లో నాయకులను కలిసి పార్టీ విజయానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో మల్లు విజయ్‌కుమార్‌రెడ్డి, చేవూరు విజయ్‌మోహన్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ పటిష్టతకు కృషి చేయండి


టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు

నారాయణవనం, ఫిబ్రవరి 11: టీడీపీ పటిష్టతకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ హెలిన్ అన్నారు. ఆదివారం నారాయణవనంలో నూతన టీడీపీ కార్యాలయాన్ని ఆ పార్టీ మండలాధ్యక్షుడు గిరిబాబు ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు చేతుల మీదుగా ప్రారంభించారు. ముఖ్య అతిథిలుగా పార్లమెంట్ అధ్యక్షుడు నరసింహయాదవ్, మాజీ హేమలత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రతి కార్యకర్త సైనికుల్లా పనిచేసి టీడీపీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వాకర్స్ అసోసియేషన్ సమావేశం


డాక్టర్ రవిరాజును సన్మానిస్తున్న వాకర్స్ అసోసియేషన్ సభ్యులు

పుత్తూరు, ఫిబ్రవరి 11: పుత్తూరు వాకర్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. పలువురు కలెక్టర్ల నుంచి పది ప్రశంసాపత్రాలను అందుకున్న డాక్టర్ రవిరాజును వాకర్స్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులురెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో అధ్యక్ష, కార్యదర్శులు కేఎల్ఎన్ మూర్తి, మునికృష్ణయ్య, ఎలెక్ట్ గవర్నర్ మాధవ నాయుడు, డాక్టర్ ఆర్ముగం పాల్గొన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా ఆత్మార్పణ దినోత్సవం


అవివాహితులకు వడిబాలు కడుతున్న మహిళలు

వడమాలపేట, ఫిబ్రవరి 11: వాసవీ కన్యకాపరమేశ్వరి ఆత్మార్పణ దినోత్సవం సందర్భంగా ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. స్థానిక కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారికి పాలాభిషేకం చేసి బంగారు చీరను అలంకరింపజేసి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఆవివాహితులైన మహిళలకు పుణ్య దంపతులు పసుపు, కుంకుమలతో బియ్యాన్ని పోసి ఒడిబాలు కట్టి అమ్మవారి ఆశీస్సులతో అవివాహిత మహిళలకు పసుపు, కుంకుమలుగా వడిబాలు సమర్పిస్తూ మహిళలు ఆశీర్వచనాలు అందజేశారు. రాత్రి అమ్మవారికి మంగళ హారతులు ఇచ్చి, తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ర్యాలీలు, సభలు నిషేధం

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 11: పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలో సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమల్లో ఉందని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు. అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహించకూడదని స్పష్టం చేశారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ చెప్పారు.

టీడీపీ గెలిస్తేనే ప్రజలకు రక్షణ, ఆస్తులకు భద్రత: భానుప్రకాష్


టీడీపీలో చేరిన నాయకులతో భానుప్రకాష్

పుత్తూరు అర్బన్, ఫిబ్రవరి 11: టీడీపీ గెలిస్తేనే ప్రజలకు రక్షణ... వారి ఆస్తులకు భద్రత ఉంటుందని టీడీపీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ స్పష్టం చేశారు. ఆదివారం మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు పరిధిలోని వినాయకపురంలో బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ, మీతో మీ తెలుగుదేశం కార్యక్రమంలో భాగంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండుసార్లు ఓట్లేసి గెలిపిస్తే నగరి ఎమ్మెల్యే ఆస్తులు మాత్రం అమాంతం పెరిగితే, ప్రజలకు అప్పులు, ముఖాలకు సున్నాలు మిగిలియాని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యేను చూసి ఆపార్టీ నాయకులు కూడా లూటీ చేయడంలో సిద్ధహస్తులుగా మారారని, ప్రకృతి సంపదను దోచుకుని రూ.కోట్లు కూడగట్టుకున్నారని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణంలో రౌడీమూకలను, ప్రైవేట్ సెటిల్‌మెంట్లు చేసే బ్యాచ్‌ను ఉక్కుపాదం మోపి అణచివేస్తామని స్పష్టం చేశారు. రానున్నది టీడీపీ, జనసేన ప్రభుత్వమని, అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారెంటీలను అమలు చేసి తీరుతామని తేల్చి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ ధనపాల్, యుగంధర్, రఫీ, జిల్లా ఉపాధ్యక్షుడు గంజి మాధవయ్య, జిల్లా అధికార ప్రతినిధి చినబాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, మధు, అశోక్, ధనపాల్, ఖాజపీర్, ప్రసాద్, ఆనంద్, మాధవనాయుడు, వార్డు నాయకులు హేమాద్రి, కుశల్‌కుమార్, చెంచయ్య, జానకీరాం, సుబ్రమణ్యం, రమేష్, జయమ్మ, అంకమ్మ, ఈశ్వర్, చిలకమ్మ పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు దళితవాడ నుంచి పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. పిండి పుణ్యకోటి, సుబ్రహ్మణ్యం, గోవర్ధన్, చెంగల్రాయుడు, సుమన్, భరత్, గుర్రప్ప, వాసు, మునిశేఖర్, దొరస్వామి తదితరులకు టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలో ప్రతి దళితుడికి సముచిత స్థానం ఉంటుందని, పుత్తూరు అభివృద్ధిని కాంక్షించే ప్రతిఒక్కరినీ పార్టీకి సాదరంగా ఆహ్వానిస్తున్నానని చెప్పారు.


సమావేశంలో మాట్లాడుతున్న మహేష్

జనసేన ఆశయాలను నెరువేర్చుకుందాం

పుత్తూరుటౌన్, ఫిబ్రవరి 11: జనసేన ఆశయాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లాలని ఆ పార్టీ నగరి నియోజకవర్గ ఇన్‌చార్జి మెరుపుల మహేష్ పేర్కొన్నారు. పట్టణంలో ఆదివారం నగరి నియోజకవర్గ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో నగరి నియోజకవర్గ టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థిని గెలిపించుకోవాలన్నారు. సురేష్, సుధాకర్‌రాజు మాట్లాడుతూ సీఎం జగన్ అరాచక పాలన అడ్డుకట్ట వేయడానికి జనసేన కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా కార్యదర్శి కటికం నాగరాజు, పేపర్ రమేష్ బాబు, కృష్ణయ్య, జగదీశ్వర్‌రాజు, స్వామినాదర్, ఉపేంద్ర, వెంకటముని, దేవా, శివలింగం, మునిశేఖర్ యాదవ్, గజేంద్ర తదితరలు పాల్గొన్నారు.

జ్ఞానప్రసూనాంబకు బంగారు ఆభరణం సమర్పణ



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారికి శ్రీకాళహస్తికి చెందిన ఎంజీ స్వరూప్, శ్రీలక్ష్మీ దంపతులు ఆదివారం రూ.4లక్షల విలువైన బంగారు ఆభరణాన్ని సమర్పించారు. అమ్మవారి నుదుట ధరించే నామాల పట్టీ, ముక్కు పుడకను 70 గ్రాముల బంగారంతో తయారు చేయించారు. ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి కుమార్తె పవిత్ర రెడ్డి, ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులకు దాతలు గురు దక్షిణామూర్తి సన్నిధిలో కానుకను అందజేశారు. దాతలకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన భాగ్యం కల్పించారు.

వైఎస్ షర్మిలకు ఘనస్వాగతం

రేణిగుంట, ఫిబ్రవరి11: జిల్లా పర్యటనలో భాగంగా ఆదివారం విశాఖ పట్టణం నుంచి ఉదయం 10.30 గంటలకు ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రేణిగుంట విమానాశ్రయం చేరుకున్నారు. రాష్ట్ర నాయకులు రాకేష్‌రెడ్డి, కేంద్ర మాజీ మంత్రి డాక్టర్ చింతామోహన్, వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్ఎస్ చిరంజీవి, సోమశేఖర్‌రెడ్డి, పి.నాగరాజు, బాబు, వీఆర్ రావణన్, మహిళా నాయకులు భారతీనాయుడు, ప్రమీలమ్మ తదితరులు ఆమెకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా సత్కరించారు.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

రేణిగుంట, ఫిబ్రవరి11: స్థానిక రైల్వేస్టేషన్ వద్ద కారు ఢీకొని తమిళనాడుకు చెందిన ఓ వృద్ధుడు మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఆదివారం ఆర్‌పీఎఫ్ స్టేషన్ వైపు నుంచి కారు అతివేగంగా వచ్చి సులభ కాంప్లెక్స్ వద్ద బస్టాండుకు వెళుతున్న ఇద్దరిని ఢీకొంది. ఓ వృద్ధుడి తలకు తీవ్ర గాయాలయ్యాయి. మరో వ్యక్తి కాలు విరిగింది. అక్కడే ఉన్న ఆటో వాలాలు క్షతగాత్రులను రుయా ఆస్పత్రికి తరలించారు. తలకు గాయమైన వృద్ధుడు మృతిచెందాడు.

గోదానం పుణ్యప్రదం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: గోదానం మహా పుణ్యప్రదమని ముక్కంటి ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు అన్నారు. శ్రీకాళహస్తికి చెందిన చెంచయ్యనాయుడు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి ఆలయానికి ఆవు, దూడను వితరణ చేశారు. గో సంరక్షణ కోసం రూ.10వేలు నగదును విరాళంగా అందజేశారు. ఆలయ ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు దాతలను శేష వస్త్రంతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కోనకెళ్లే పర్యాటకులు జాగ్రత్తలు పాటించాలి

కేవీబీపురం ఫిబ్రవరి11: మండలంలో ఉన్న ఆరే జలపాతానికి వారంవారం పర్యాటకుల సంఖ్య పెరుగుతోంది. కొత్తగా వచ్చే వారికి కోనలో ఉన్న నీటి మడుగుల లోతు తెలియక ఈతకు దిగి మృతి చెందుతున్నారు. దీనిపైన పోలీసులు, అటవీ శాఖ ప్రత్యేకంగా దృష్టి పెట్టి పర్యాటకులకు సూచనాలు చేస్తూ బ్యాగులు, వస్తువులు తనిఖీ చేస్తున్నారు. మద్యం తీసుకెళ్లరాదని హెచ్చరికలు చేస్తున్నారు. ఎస్ఐ సునీల్, ఏఎస్ఐ లోకనాథం, పోలీస్ సిబ్బంది, అటవీశాఖ సిబ్బంది సూచనలు చేస్తున్నారు.

ఘనంగా టీడీపీ నాయకుడి జన్మదినం



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: టీడీపీ నాయకులు, శ్రీకాళహస్తి మున్సిపల్ మాజీ వైస్ ఛైర్మన్ మిన్నల్ రవి జన్మదిన వేడుకలు పట్టణంలోని ముత్తరాశి పాళెంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. పలువురు టీడీపీ నాయకులు ఆయన్ను శేష వస్త్రంతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, పార్ల మెంట్ ఎస్టీ సెల్ అధ్యక్షులు సుబ్బయ్య, నాయకులు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: ముక్కంటి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. రెండవ శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతో రద్దీ పెరిగింది. ఉదయం నుంచి ఆలయంలోని క్యూలైన్లో భక్తులు బారులు తీరారు. సాయంత్రం రాహు కేతు సర్ప దోష నివారణ పూజలు జరిపించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆసక్తి చూపారు. మొత్తంగా ఆదివారం 26వేల మంది భక్తులు ఆలయాన్ని దర్శించుకున్నట్లు అధికారులు అంచనా వేశారు.

పాదచారిని ఢీకొన్న ద్విచక్ర వాహనం

ఏర్పేడు, ఫిబ్రవరి 11: ద్విచక్ర వాహనం ఢీకొని ఓ పాదచారి గాయాలపాలయ్యాడు. ఏర్పేడు ఎస్ఐ జిలాని కథనం మేరకు.. శ్రీకాళహస్తి మండలం ఎంపేడు దళితవాడకు చెందిన పల్లం రాజేష్ పల్లంపేటకు నడిచి వెళ్తుండగా వెంకటగిరి నుంచి ఏర్పేడు వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం ఢీకొంది. రాజేష్ గాయపడ్డాడు. స్థానికులు 108లో అతడిని శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఏర్పేడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న టిప్పరు



సత్యవేడు, ఫిబ్రవరి 11: ఓ టిప్పరు అతి వేగంగా వెళుతూ విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటన మండలంలోని రాజగోపాల పురం సమీపంలో ఆది వారం జరిగింది. చెన్నై నుంచి స్థానిక కంకర క్వారీలకు వెళుతున్న ఓ టిప్పరు రాజగోపాలపురం సమీపంలో అతి వేగంగా వెళుతూ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభం విరిగి లారీపై పడింది. అదృష్టావశాత్తు ఎలాంటి ప్రమాదం జరగలేదు. కాగా టిప్పర్లు పరిమితికి మించిన లోడుతో అతివేగంగా వెళుతూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. సంబంధిత శాఖ అధికారులు మామూళ్ల మత్తులో పడి పట్టించుకోవడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

వేడుకగా అగ్నిగుండ మహోత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: శ్రీకాళహస్తిలోని బహదూర్‌పేట వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆదివారం అగ్నిగుండ మహోత్సవం వేడుకగా జరిగింది. వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు ఆత్మార్పణ సమర్పించిన రోజు పురస్కరించుకుని ఆలయంలో విశేష పూజలు చేశారు. రాత్రి ఆలయం ఎదుట అగ్నిగుండ మహోత్సవం జరిగింది. భక్తులు అగ్నిగుండ ప్రవేశం చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలక మండలి ప్రెసిడెంట్ వడ్లపూడి మధుసూదన్ భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సామాన్యుని పాశుపతాస్త్రం ఓటు

ఏర్పేడు, ఫిబ్రవరి 11: సామాన్యుని పాశుపతాస్త్రం ఓటు అని యువనేస్తం అసోసియేషన్ అధ్యక్షులు మునిశేఖర్ అన్నారు. చిందేపల్లి ఎస్టీకాలనీలో ఆదివారం మండల కో-ఆర్డినేటర్ అరుణ ఆధ్వర్యంలో ఓటు విలువ, రాజకీయాల పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంచి వ్యక్తిని ఎన్నుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వలంటీర్లు లక్ష్మి, అంకయ్య, కవిత తదితరులు పాల్గొన్నారు.

ఓటును కొనే పార్టీలను ఓడించాలి



ప్రచారం చేస్తున్న బీఎస్పీ ఎంపీ అభ్యర్థి గుర్రప్ప

వరదయ్యపాళెం, ఫిబ్రవరి 11: ఓటుకు డబ్బు ఇచ్చే రాజకీయ పార్టీలను ఓడించేందుకు ప్రజలు సిద్ధం కావాలని విశ్రాంత న్యాయమూర్తి, బీఎస్పీ తిరుపతి ఎంపీ అభ్యర్థి గుర్రప్ప పిలుపునిచ్చారు. ఆదివారం వరదయ్యపాళెంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. సత్యవేడు బీఎస్పీ అభ్యర్థి ధనంజయను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ జిల్లా అధ్యక్షులు జయచంద్ర, అసెంబ్లీ అధ్యక్షులు దామోదరం, మనోహర్, ఏలుమలై, మురళి, వనరాజు, ఆదిశరాజు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి పరామర్శ

ఏర్పేడు, ఫిబ్రవరి 11: ఏర్పేడు మండలం రాజులకండ్రిగకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు నరసింహారావు(85) కుటుంబసభ్యులను బొజ్జల బృందమ్మ పరామర్శించారు. ఇటీవల నరసింహారావు మృతిచెందడంతో ఆదివారం గ్రామానికి విచ్చేసి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆమె వెంట టీడీపీ నాయకులు ధనంజయులునాయుడు, నాగరాజునాయుడు, అంకయ్య, విజయ్ ఉన్నారు.

● కందాడులో టీడీపీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ విజయ్ కుమార్తె పెళ్లికి హాజరై వధూవరులను ఆశీర్వదించారు.

దక్షిణ భారత హిందీ పరీక్షలు

పిచ్చాటూరు, ఫిబ్రవరి 11: పిచ్చాటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం దక్షిణ భారత హిందీ ప్రచార సభ పరీక్షలు జరిగాయి. ఈ పరీక్షలకు మొత్తం 70 మంది విద్యార్థులు హాజరైనట్లు హిందీ పండిట్ మల్లీశ్వరి తెలిపారు. ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు దక్షిణ భారత హిందీ ప్రచార సభ సర్టిఫికెట్లను అందిస్తుందన్నారు. ఈ పరీక్షలను ఉపాధ్యాయులు నెయిల్స్, వలర్మది, సీఆర్పీ వాసు పర్యవేక్షించారు.

మాంసాహారం మానేద్దాం

పిచ్చాటూరు, ఫిబ్రవరి 11: మాంసాహారాన్ని మానేద్దామని పిరమిడ్ ధ్యాన సంఘం ప్రతినిధి, రిటైర్డ్ టీచర్ జయరామరాజు పిలుపునిచ్చారు. ఆదివారం చెంచురాజుకండ్రిగ, సిద్ధిరాజు కండ్రిగల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మాంసాహారం కలిగే అనర్థాలను, శాఖాహారం వల్ల కలిగే ప్రయోజనాలను తెలియజేసే కరపత్రాలు పంపిణీ చేశారు. తర్వాత చెంచురాజుకండ్రిగలోని పిరమిడ్ ధ్యాన మందిరానికి చేరుకుని ధ్యానం తరగతులు నిర్వహించారు. పలమనేరు, పుత్తూరు, తమిళనాడులోని పళ్లిపట్టు ప్రాంతాల నుంచి పిరమిడ్ ధ్యాన సంఘం సభ్యులు భారీగా తరలివచ్చారు. విశ్రాంత టీచర్ జయరామరాజు సభ్యులకు భోజనం అందించారు.

శుకబ్రహ్మ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: శ్రీకాళహస్తిలోని శుకబ్రహ్మ ఆశ్రమ ప్రారంభోత్సవ దినోత్సవం పురస్కరించుకుని ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పీఠాధిపతి విద్యా స్వరూపానందగిరి స్వామి ఆశ్రమ గురువుల చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు చేశారు. అనంతరం ఆశ్రమంలో అఖండ భగవన్నామ సంకీర్తన ప్రారంభించారు. ఇందులో భాగంగా 18 అధ్యాయాల అఖండ పారాయణం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.



సద్దికూడు మడుగు, భూపతేశ్వరకోన, భూపతేశ్వర కోనలో గతంలో మృతిచెందిన ముగ్గురు యువకులు (ఫైల్ ఫొటోలు)

కోనల్లో మరణ మృదంగాలు

- విషాదం నింపుతున్న విహార యాత్రలు
- ప్రాణం తీస్తున్న సరదా
- స్పందించని అధికారులు

నాగలాపురం, ఫిబ్రవరి 11: నాగలాపురం మండలంలోని రాజుల కండ్రిగ గ్రామం సమీపంలో ఉన్న సద్దికూడు మడుగు, టీపీకోట వద్ద ఉన్న భూపతేశ్వర కోన జలపాతాలు పర్యాటకుల పాలిట మృత్యుకేంద్రాలుగా మారుతున్నాయి. విహార యాత్రకోసం వస్తున్న తమిళనాడు యువకులు ఇక్కడ జలపాతాల్లో దిగి ప్రాణాలు కోల్పోతున్నారు. సద్దికూడు మడుగు, భూపతేశ్వర కోన జలపాతాలు పచ్చని ప్రకృతితో అలరారుతూ పర్యాటకులను మంత్ర ముగ్ధులను చేస్తుంటాయి. ప్రకృతి ఒడిలో సేదదీరేందుకు వస్తున్న పర్యాటకులు ఆ ప్రాంతాలపై అవగాహన లేక జలపాతాల్లో దిగి మృత్యువాత పడుతున్నారు. ప్రధానంగా వారాంతపు సెలవుల్లో చెన్నై నుంచి విద్యార్థులు, సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు సరదాగా గడిపేందుకు వందల సంఖ్యలో వస్తుంటారు. తమిళనాడు నుంచి మద్యం బాటిళ్లను తెచ్చుకుని పీకల దాకా తాగి జలపాతంపై నుంచి నీటిలోకి దూకి నీటి సుడుల్లో చిక్కుకుని ఊపిరాడక ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ జలపాతాలు లోతుగా ఉంటాయి. దీనిపై అవగాహన లేని యాత్రికులు అర్థాంతరంగా తనువు చాలి స్తున్నారు. ఈ ప్రాంతంలో ఎక్కడ చూసినా తమిళనాడు మద్యం బాటటిళ్లు, బీరు బాటిళ్లు పడి ఉండటమే ఇందుకు నిదర్శనం. ఈ నీటి మడుగులు ఈ జలపాతాలకు వచ్చే యువకులు, విద్యార్థులు, ఉద్యోగులు దట్టమైన అటవీ ప్రాంతాల్లోకి వెళ్లి నాలుగైదు రోజులు కూడా గడిపి వస్తుంటారు. ఈ క్రమంలో అటవీ ప్రాంతాల్లో దారి తప్పిపోయిన వారిని పోలీసులు, స్థానికులు కాపాడిన సందర్భాలు సైతం ఉన్నాయి.

గతంలో సంభవించిన మరణాలు

● 2021 సెప్టెంబరు 13న చెన్నై మాదావరం ప్రాంతానికి చెందిన సంజయ్‌కుమార్, దేవా, విజయ్, సంతోష్, రమేష్, తులసీనాథన్ అనే ఆరుగురు యువకులు సద్దికూడు మడుగు జలపాతానికి విహారయాత్రకు వచ్చారు. జలపాతంపై నుంచి దూకుతున్న క్రమంలో సంజయ్‌కుమార్, దేవా మడుగులో లోపలికి వెళ్లిపోయారు. బయటకు రాలేక ఆ ఇద్దరు యువకులు మృత్యువాత పడ్డారు. అప్పటి ఎస్ఐ హనుమంతప్ప స్థానికులు, గజ ఈతగాళ్ల సాయంతో మృతదేహాలను బయటకు తీశారు.

● గత ఏడాది మే 16వ తేదీన చెన్నైకి చెందిన మాధవన్, నవీన్, కార్తీక్ ప్రసాద్, హరిశుధన్, మరో యువతి భూపతేశ్వర కోనకు వచ్చారు. ఇందులో ముగ్గురు యువకులు గల్లంతయ్యారు. రెండు రోజుల తర్వాత మడుగులో శవమై తేలారు.

● తాజాగా గత గురువారం చెన్నై కుండ్రత్తూరుకి చెందిన 9మంది స్నేహితులు కలిసి సద్దికూడు మడుగుకు విహార యాత్రకు వచ్చారు. అందులో ఒక యువకుడు శ్యామ్ నీటిలో గల్లంతయ్యాడు. శనివారం మృతదేహాన్ని వెలికి తీశారు.

● **ఇలా చేస్తే ప్రమాదాలు తగ్గుతాయ్**

భూపతేశ్వరకోన, సద్దిమడుగు జలపాతాలకు శని, ఆదివారాల్లో చెన్నై నుంచి ద్విచక్ర వాహనాల్లో అధిక సంఖ్యలో యువకులు వస్తుంటారు. వీరందరూ ఇటు నాగలాపురం నుంచి టీపీకోట రోడ్డు మార్గం మీదుగా అటు సత్యవేడు నుంచి టీపీకోట మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. ఆ రెండు రోజులు నాగలాపురం, టీపీకోట ప్రాంతాల్లో పోలీసులు వారికి అవగాహన కల్పిస్తే చాలా వరకు ప్రమాదాలను నియంత్రించవచ్చు. ఇప్పటికైనా పోలీస్, అటవీశాఖాధికారులు చర్యలు తీసుకోకపోతే రానున్న వేసవిలో ఈ జలపాతాల్లో మరిన్ని మరణాలను చూడాల్సి వస్తుంది.

● **ఇవి పర్యాటక కేంద్రాలు కావు**

సద్దికూడు మడుగు, భూపతేశ్వరకోనలు వాస్తవానికి పర్యాటక కేంద్రాలు కావు. పర్యాటకానికి ఎంతమాత్రం అనువుకావు. ఇవి రిజర్వు ఫారెస్టులకు సంబంధించింది. ఇక్కడ పర్యాటకం కూడా నిషేదం. అయితే పోలీసులు, అటవీశాఖాధికారుల పర్యవేక్షణ లోపంతో పర్యాటకులు అక్కడికి వెళ్లి మృత్యువుబారిన పడుతున్నారు.

ఉమ్మడి అభ్యర్థి గెలుపు కోసం పని చేయండి : జనసేన



జెండాను ఆవిష్కరిస్తున్న నాయకులు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 11: సత్యవేడు నియోజక వర్గం జనసేన-టీడీపీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి కార్యకర్తా పని చేయాలని జనసేన ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యక్షుడు బత్తిన మధుబాబు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో జనసేన పార్టీ అధ్యక్షుడు బాషా ఆధ్వర్యంలో జెండాను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సమావేశంలో 50 మంది పార్టీలో చేరారు. ఈ కార్యకమరంలో నియోజక వర్గ ఇన్‌చార్జ్ కొప్పల లావణ్యకుమార్, జిల్లా కార్యదర్శులు ఆనంద్, హేమకుమార్, నాయకులు థామస్, రూపేష్, మణికంఠయ్య, శేఖర్, కృష్ణ, ఆనంద్, బాలజీ, శరత్, ఢిల్లీబాబు, రాజేష్, హరి, సుబ్రమణ్యం, ఉదయ్, సురేష్, తేజ, కుమార్, వేలు పవన్, భానుప్రకాష్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మధుకు అండగా నిలవాలి



వన్నెరెడ్ల జైత్రయాత్ర సభ

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డికి వన్నెకుల క్షత్రియులు మరోసారి అండగా నిలవాలని రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ పిలుపు నిచ్చారు. శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో ఆదివారం వన్నెకుల క్షత్రియ జైత్రయాత్ర సభ జరిగింది. ఈ సందర్భంగా మోపిదేవి మాట్లాడుతూ వన్నెరెడ్ల అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేసిన ఎమ్మెల్యేకి వచ్చే ఎన్నికల్లో సామాజిక వర్గం ప్రజలంతా సహకరించాలని కోరారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం మాట్లాడుతూ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని మరోసారి గెలిపించుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ భరత్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి విరాళం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: ముక్కంటి ఆలయంలో నిర్వహించే నిత్యాన్నదాన పథకానికి చీరాలకు చెందిన లక్ష్మీ ప్రసన్న అనే భక్తురాలు రూ.50 వేల నగదును విరాళంగా సమర్పించారు. ఆదివారం ఆమె ముక్కంటి ఆలయాన్ని దర్శించుకున్నారు. అంతకుముందు పీఆర్‌ఓ కార్యాలయంలో అధికారులను కలిసి నగదు అందించారు.

కాపు సంక్షేమ సేన పట్టణ కమిటీ ఎన్నిక



శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: కాపు సంక్షేమ సేన శ్రీకాళహస్తి పట్టణ కమిటీని ఎన్నుకున్నారు. పట్టణంలోని ఆ సంఘం కార్యాలయంలో ఆదివారం నియోజకవర్గ సభ్యుల సమావేశం జరిగింది. ఇందులో భాగంగా పట్టణ అధ్యక్షుడిగా నవీన్ కుమార్, ఉపాధ్యక్షుడిగా కంఠా సుబ్రహ్మణ్యం, వెంకటముని, ప్రధాన కార్యదర్శిగా మునిరాజ, తిరుమల తదితర సభ్యులను ఎన్నుకున్నారు. నియోజక వర్గ అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడు పాల్గొన్నారు.

సమష్టిగా పని చేయండి

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 11: వైసీపీ విజయం కోసం సమష్టిగా పనిచేయాలని ఆ పార్టీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ కోరారు. మండల కేంద్రంలోని మార్కెట్ యార్డులో మండల వైసీపీ నాయకులు, కార్యకర్తల పరిచయ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నాయకులు రాజేష్‌ను ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ జేసీఎస్ కన్వీనర్ రాకేష్, నాయకులు గోపాల్‌రెడ్డి, గురువయ్య పాల్గొన్నారు.

42 మద్యం సీసాల స్వాధీనం..నలుగురి అరెస్టు



బుచ్చినాయుడు కండ్రిగ పోలీసుల అదుపులో నిందితుడు

బుచ్చినాయుడుకండ్రిగ, ఫిబ్రవరి 11: మండల కేంద్రంలో బస్టాండు దగ్గర మద్యం తరలిస్తున్న కంచనపుత్తూరుకు చెందిన మణిని పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. అతడి నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ వెంకటనరసింహ కేసు నమోదు చేశారు.

ఏర్పేడు: మర్రిమంద గ్రామానికి చెందిన చెంగల్‌రాయులు, బండారుపల్లి గ్రామానికి చెందిన ఓ మహిళ మద్యం విక్రయిస్తుండగా పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 20 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ జిలానీ వారిద్దరిపై కేసు నమోదు చేశారు.

తొట్టంబేడు: మండలంలోని కొత్తకండ్రిగ క్రాస్ వద్ద అక్రమంగా మద్యం తీసుకెళుతున్న బత్తెయ్యను పోలీసులు అరెస్టు చేశారు. అతడి నుంచి 12మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రాఘవేంద్ర కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

పార్కింగ్ ఫీజు సరే.. వాహనాలకు భద్రత ఏదీ?



ముందు టైరు దెబ్బతిన్న కారు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: పార్కింగ్ ఫీజు సరే వాహనాలకు భద్రత ఏదీ? అని ముక్కటి భక్తులు ప్రశ్నిస్తున్నారు. చెన్నై నగరానికి చెందిన తంగరాజు ఓ సాఫ్ట్ వేర్ కంపెనీలో హెచ్‌ఆర్‌గా పనిచేస్తుంటాడు. ఆదివారం కుటుంబ సమేతంగా ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునేందుకు శ్రీకాళహస్తికి కారులో వచ్చారు. సన్నిధి వీధిలో కొందరు యువకులు రూ.71 కారు పార్కింగ్ కోసం ఫీజు వసూలు చేసి రశీదు ఇచ్చారు. ఆ తర్వాత రెండో గేటు పక్కనే కారును పార్కు చేసుకోవాల్సిందిగా భక్తులకు సూచించారు. అదే ప్రకారం భక్తుడు శివయ్య గోపురం పక్కన కారు పెట్టబోయాడు.పార్కింగ్ స్థలంలో ఇనుప కమ్మీ ఉండడంతో కారు ముందు చక్రం పేలిపోయింది. భక్తుడు పార్కింగ్ సిబ్బంది నిలదీసాడు. వాహనాలను నిలిపేందుకు నిర్దేశిత స్థలం లేదు..? వాహనాలకు కనీసం నిలువ నీడ లేదు..? వాహనాలకు కనీస భద్రత లేదు..? మరి ఎందుకోసం పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్నారంటూ ప్రశ్నించాడు. భక్తుడి ప్రశ్నలకు సమాధానం చెప్పలేక పార్కింగ్ వసూలు సిబ్బంది అక్కడ నుంచి జారుకున్నారు. ఎండలో కారు చక్రాన్ని మార్చుకున్నాడు. వాహనాలకు పార్కింగ్ సిబ్బంది రక్షణ కల్పించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరాడు. తనకు జరిగిన నష్టంపై న్యాయపోరాటం చేసేందుకు ప్రయత్నిస్తానని వివరించాడు.

ముక్కంటి సేవలో ప్రముఖులు

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: ముక్కంటి ఆలయాన్ని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. ఇందులో భాగంగా రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణ కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేశారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం వారికి స్వాగతం పలికి దర్శనం ఏర్పాట్లు చేశారు. స్వామి అమ్మవార్ల దర్శనం అనంతరం గురు దక్షిణామూర్తి సన్నిధిలో పండితులు వేద ఆశీర్వచనం పొందారు. అనంతరం స్వామి అమ్మవార్ల చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ స్వామిరెడ్డి భరత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా సాంస్కృతిక దినోత్సవం

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: శ్రీకాళహస్తిలోని ది స్కూల్‌లో శనివారం రాత్రి సాంస్కృతిక దినోత్సవం ఘనంగా జరిగింది. ముక్కంటి ఆలయ మాజీ ఛైర్మన్ శాంతారామ్ జే పవర్ చిత్రపటానికి పాఠశాల నిర్వాహకులు ఘనంగా నివాళులర్పించారు. శుకబ్రహ్మ ఆశ్రమం నుంచి సర్వాత్మ నందగిరి స్వామి ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలతో సాంస్కృతిక కార్యక్రమాలను ప్రారంభించారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జనార్దన్ రావు జే పవర్, ప్రతాప్ రావు, పీవీఆర్ గ్రూప్ సంస్థ నిర్వాహకులు అర్చనా పవర్, హెచ్ఎం విశాల, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

అబ్బురపరిచిన ఆవిష్కరణలు

ముగిసిన ఇన్‌స్పైర్ మనక్ వైజ్ఞానిక ప్రదర్శన

శ్రీకాళహస్తి, ఫిబ్రవరి 11: విద్యార్థుల వినూత్న ఆవిష్కరణలు అందరినీ అబ్బురపరిచాయి. శ్రీకాళహస్తిలో రెండు రోజులపాటు జరిగిన జిల్లా ఇన్‌స్పైర్ మనక్ ఎగ్జిబిషన్‌లో చిన్నారుల సృజనాత్మక రూపకల్పనలు ఆలోచింపజేశాయి.

సులభతరంగా నేల శుద్ధి



ఈ విద్యార్థి పేరు లక్ష్మి. బుచ్చినాయుడు కండ్రిక మండలం కంచన పుత్తూరు ఎంపీయుపి పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. ఉపాధ్యాయులు జయకృష్ణ పర్యవేక్షణలో ఈజీ ఫ్లోర్ క్లీనర్ పరికరాన్ని రూపొందించింది. సహజంగా నేలను తుడిచేందుకు మాప్ వేసే విషయం తెలిసిందే. అయితే సబ్బు నీరు, బ్రష్ నిరుపయోగమైన ప్లాస్టిక్ డబ్బాలో అమర్చారు. పైన హ్యాండిల్‌కు స్విచ్ ఏర్పాటు చేశారు. స్విచ్‌తో సరిపడిన మోతాదులో సబ్బు నీరును విడుదల చేయడంతో పాటు, మోటారు అనుసంధానంతో కింద బ్రష్ నేలను శుద్ధి చేస్తుంది. ఇంట్లోనే తయారు చేసుకునే ఎంతో ఉపయోగకరమైన ఈ ప్రయోగం మొదటి స్థానంలో ఎంపికైంది.

ప్రశ్నాపత్రాలు పదిలం



ఈ విద్యార్థి పేరు పెంచల్ తేజ్ కుమార్. చంద్రగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఉపాధ్యాయులు రామ్మూర్తి సహాయంతో ఎలక్ట్రిక్ ప్రొటెక్షన్ ఫర్ ఎగ్జామ్ పేపర్ ఆవిష్కరణను ప్రదర్శించారు. ఎన్ కోడింగ్, డీ కోడింగ్ సిద్ధాంతంపై స్ట్రాంగ్ రూమ్ నమూనాతో పరికరాన్ని తయారు చేశారు. ప్రశ్నా పత్రాలను బయటకు తీయాలంటే ముందుగా ఎన్‌క్రిప్షన్ చేసిన అంకెల డిజిటల్ లాక్‌ను తెరవాలి. తప్పు అంకెలు నమోదు చేస్తే డిజిటల్ లాక్ తెరచు కోదు. అంతే కాకుండా అలారమ్ మోగిస్తుంది. ఈ విధానం ద్వారా పరీక్షల సమయంలో ప్రశ్నాపత్రాల లీకేజీని నివారించవచ్చన్న ఆలోచనతో రూపొందించారు. ఈ ఎగ్జిబిట్ రెండవ స్థానంలో నిలిచింది.

సహజ పద్ధతిలో గృహశుద్ధి



ఈ విద్యార్థి పేరు పావని. డక్కిలి మండలం తీర్థంపాడు జడ్పీ హైస్కూల్లో 9వ తరగతి చదువుతోంది. ఉపాధ్యాయులు ఈశ్వరయ్య ఆధ్వర్యంలో మల్టీ పర్పస్ నేచురల్ క్లీనర్ ఆవిష్కరణను ప్రదర్శించారు. నిమ్మరసం, గలుసు ఉప్పు, మరి కొన్ని మిశ్రమాలతో ఇంట్లోనే సహజ పద్ధతిలో పౌడర్ తయారు చేశారు. దీని ద్వారా వంటింటి పాత్రలతో పాటు, ఇంటి గోడలు నేలను కూడా శుభ్రం చేసు కోవచ్చు. రసాయనాల వాడకాన్ని నిర్మూలించి క్యాన్సర్‌ను అరికట్టవచ్చని విద్యార్థిని ఆలోచన. ఈ ప్రదర్శనకు మూడో స్థానం లభించింది.